1

నవతెలంగాణ

మెదక్

ఆదివారం | 09 మార్చి 2025 | www.navatelangana.com

సీబీఎల్ పరిశ్రమలో మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-చౌటకూర్

మండలంలోని సిబీఎల్ పరిశ్రమలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ఉండి సమాజానికి సేవలు అందిస్తున్నారన్నారు. ఇలాగే ముందుకు సాగాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బాగారెడ్డి, యూనియన్ జనరల్ సెక్రెటరీ ప్రసన్న రావు, ఆఫీస బేరర్స్ ఏ నాగభూషణం, పి.మల్లారెడ్డి, ఎం.సత్యనారాయణ, బి.దేవరాజ్ కమిటీ సభ్యులు బి శ్రీనివాస్, ప్రభాకర్, లక్ష్మారెడ్డి, విజయరాజు, బి విటల్, ప్లాంట్ హెడ్ ఆశిష్ గుప్తా, మేనేజర్ సురేష్ గుప్తా, కాంట్రాక్ట్ మెంబర్స్, జనరల్ సెక్రెటరీ కే.సురేష్, లక్ష్మణ్, రమేష్, శీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-సంగారెడ్డి

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస రాథోడ్‌లు మాట్లాడుతూ.. సమాజంలో సగభాగమైన మహిళా మూర్తులు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకెళ్తున్నారని కొనియాడారు. ఇంకా సమాజంలో దాగున్న కొన్ని స్త్రీవాద రుగ్మతల్ని తొలగించడానికి కృషి చేయాలని కోరారు. ఎస్టీయూ జిల్లా మహిళా నాయ కురాలు భారతి, ఝాన్సీ మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం ప్రపంచవ్యాప్తంగా చేపడుతున్న సదస్సులు, సమావేశాల్లో భాగంగా ప్రతీ సంవత్సరం ఎస్టీయూ సంఘం ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఆహ్వానిస్తూ సగర్వంగా గౌరవిస్తూ సన్మానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, మాజీ ఆర్థిక కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూచినెల్లి పారిశ్రామిక వాడలో గుంతల మయమైన రోడ్లు

- ప్రమాదాలకు గురవుతున్న కార్మికులు, ప్రజలు
- వెంటనే కొత్త రోడ్లు వేయాలి, లైట్లు వెలిగేలా చూడాలి
- సీఐటీయూ జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్.మహిపాల్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్‌లోని బూచినెల్లి ప్రాంతంలో ఉన్న పారిశ్రామిక వాడలో కొత్త రోడ్లు వేయాలని, వీధి లైట్లు వెలిగేలా చూడాలని సీఐటీయూ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్.మహిపాల్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ధ్వంసమైన రోడ్లను శనివారం పరిశీలించారు. అనంతరం మహిపాల్ మాట్లాడుతూ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, గుంతల మయంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వేలాది మంది కార్మికులు, ప్రజలు తిరిగే రోడ్లు పరిశ్రమలకు డ్యూటీకి వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందన్నారు. మూడు షిఫ్టులలో వెళ్లే కార్మికులు ఈ రోడ్డుపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు పూర్తిగా గుంతల మయంగా మారడంతో పాటు లైట్లు కూడా లేక కార్మికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురై కింద పడిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అదేరకంగా బూచి నెల్లి, బూర్ది పాడు తుంకుంట గ్రామాలకు వెళ్లే రోడ్లు కూడా పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి టీజీఐఐసీ అధికారులు, ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సందీప్ రెడ్డి, మధుకర్, దేవిదాస్ రాంశెట్టి తదితరులు పాల్గొన్నారు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జహీరాబాద్

మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఇన్చార్జి డాక్టర్ ఏ.చంద్ర శేఖర్ ఆదేశాలతో ఆయన క్యాంపు కార్యా లయంలో నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో మహిళలకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. ఉచిత బస్సు ప్రయా ణం వంటి పథకాలతో పాటు మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అలుపెరుగని కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహి ళలకు మహిళాదినోత్సవ జ్ఞాపికలను అందజేసి, శాలువా కప్పి సన్మానించారు.

మహిళా దినోత్సవం సందర్భంగా పలువురికి సన్మానం



నవతెలంగాణ-సదాశివపేట

అంతర్జాతీయ మహిళా దినత్సవం సందర్భంగా మండలంలోని నిజాంపూర్‌లో మాజీ ఎంపీటీసీ సూర మాధవరెడ్డి ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ ఆయాలను, ఏఎన్ఎంలను, డ్వాక్రా గ్రూపు మహి ళలను, సీఏలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూరా మాధవరెడ్డి మాట్లాడుతూ.. 'సృష్టికి మూలం మహిళ అన్నారు. ఆమె శక్తియుక్తులు అపారం.. ఆమె ఓ ప్రేరణ.. ఓ లాలన.. ఆమె లేకుంటే ఈ సృష్టి లేదు. దానికి గమ్యం, గమనం లేదు. మనిషికి జీవం, జీవితమే లేదు. ఆమే లేకుంటే అంతా శూన్యం. అందుకే ఆమెకు శతకోటి వందనాలు. అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ చరిత్ర సృష్టిస్తున్నారు' అని కొనియాడారు. అవకాశాలు రాకపోయినా, అవమా నాలు ఎద రైనా, ఎవరో వచ్చి సాయం చేస్తారని ఎదురుచూడడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బి.రమేష్, సురా సుభాష్ రెడ్డి, మాజీ సర్పంచ్ మఠం కరుణాకర్, తలారి ప్రకాష్, ధనుంజయ్, తలారి దేవశ్యం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధికారుల ఆదేశాలు బేఖాతర్


- పంచాయతీలలో మహిళా గ్రామ సభలు నిర్వహించని వైనం



నవతెలంగాణ-ఝరాసంగం

మహిళలు ఎంత ఎత్తుకు ఎదిగిన వివక్ష, అసహనం వంటివి ఏదోక రూపంలో నేటికీ కనిపిస్తూనే ఉన్నాయి. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి నుంచి పట్టణ, మండల, గ్రామస్థాయిల్లో 'మహిళా గ్రామసభలు' నిర్వహించి మహిళలు సాధించిన సాధికారత, విజయగాథలను వెలికి తీసి వారి స్ఫూర్తి అందరికీ వినిపించాల్సిన అవసరం ఉందని అధికారుల సర్క్యులర్స్ ఉన్నాయి. అంతేకాకుండా మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో ఎంపీడీవో ముఖ్యమంత్రి సందేశాన్ని అందరికీ వినిపించేలా అన్ని శాఖలను సమన్వయం చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించాలి. కానీ జిల్లా అధికారుల ఆదేశాలు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఝరాసంగం గ్రామపంచాయతీలో శనివారం గ్రామసభ నిర్వహించలేదు. మండల కేంద్రంలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే ఇక వేరే గ్రామాల పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. మహిళా గ్రామసభను నిర్వహించకపోవడం అంటే వారిని అవమానించినట్లే అని పలువురు విమర్శిస్తున్నారు.

ఎరుకలకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలి



నవతెలంగాణ-సదాశివపేట

ఎస్టీ జాబితాలో ఉన్న ఎరుకల కులం వారికి ఎమ్మెల్యే కోటాలో ఒక ఎమ్మెల్సీ కేటాయించాలని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల పురం గోపాల్ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎస్టీ ఎరుకల సమాజం వారు సుమారుగా 8 లక్షల జనాభా ఉన్నదన్నారు. ప్రస్తుతం ఎస్టీ జాబితాలో ఉపకులాలు లంబాడ, గోండు, ఆదివాసి లాంటి కులాలను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ గుర్తించి రాజకీయ అవకాశాలు ఇవ్వడంతో పాటు వివిధ హోదాలు కల్పించిందన్నారు. ఈ జాతుల వారు ప్రస్తుతం ఎమ్మెల్యేలు, ఎంపీలు కొనసాగుతున్నారన్నారు. దాంతో వారి జాతులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటున్నారన్నారు. ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎస్టీ ఎరుకల కులం వారు ఏ రంగంలో కూడా అభివృద్ధి చెందలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తమ కులం వారు కూడా కృషి చేశారన్నారు. కానీ తమ ఎరుకల సమాజానికి ఇప్పట వరకు ఎటువంటి పదవులు రాలేదన్నారు. కాబట్టి ఎస్టీ ఎరుకల సమాజానికి ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని ఎమ్మెల్యేల కోటాలో కేటాయించాలని కోరారు.

మహిళల స్వేచ్ఛా, సమానత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- ప్రముఖ వైద్యురాలు డా.జ్యోతిర్మాయి, ఎంపీడీవో మధులత
- కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



నవతెలంగాణ-సంగారెడ్డి

మహిళల స్వేచ్ఛా, సమానత్వంతోనే అభివృద్ధి సాధ్య మని ప్రముఖ వైద్యురాలు డా.జ్యోతిర్మాయి, ఎంపీడీవో మధులత అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో సంగారెడ్డి మున్సిపల్ ఆఫీస్ మీటింగ్‌హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణించిన వారికి సత్కరించారు. కాగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్. జ్యోతిర్మాయి, ఎంపీడీవో మధులత, యువ న్యాయవాది లక్ష్మి, సఖి సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ కల్పన హాజరై మాట్లాడు తూ.. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్న కేవీపీఎస్‌ను అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని.. విద్యార్థి దశ నుండే భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిం చుకోవాలన్నారు. అటువైపు ఎదిగేం దుకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. సావిత్రిబాయి పూలే, రమాబాయి అంబేద్కర్, చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యం లాంటి మహనీయులు పోరాడి హక్కులు సాధించారన్నారు. వారి స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలన్నారు. అలాగే మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జ్యోతిబా పూలేలు మహిళల కోసం వారి హక్కుల కోసం కృషి చేసినా రని.. వారందరి స్ఫూర్తితో ముందుకెళ్దామన్నారు. మహిళలు విద్యతో రాణించబడతారని అలాగే వైద్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చట్టాల పైన అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం కృషి చేయాలన్నారు. మహిళలపై లైంగికదాడులు, హత్యలు, మానసికంగా ఇబ్బందులు పెడుతున్న వారిని కఠినంగా శిక్షించి.. మహిళలకు భరోసా కల్పించాలన్నారు. చట్టసభల్లో తగిన ప్రాధాన్యత నివ్వాలన్నారు. అనంతరం కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్, సామాజిక ఉద్యమ నాయకులు లలిత, శారమ్మలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. అశోక్, సింగర్ సుహాసిని, మహిళా నాయకురాలు అరుణ, దివ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివకుమార్ బి రాజు జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ జిల్లా కమిటీ సభ్యులు ప్రభాకర్, దివాకర్, శ్రీనివాస్, సామాజిక ఉద్యమ నాయకులు బసవరాజ్, పోతురాజు, పవన్, పద్మ, హారిక, దివ్య తదితరులు పాల్గొన్నారు.

గీతంలో విజయవంతంగా ముగిసిన 'గస్టో'

విజేతలకు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాల ప్రదానం



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ డైరెక్టరేట్ నిర్వహించిన అంతర్ విశ్వవిద్యాలయ వార్షిక క్రీడా ఉత్సవం, గస్టో 2025, క్రీడాతత్వం, సమష్టికృషి, అజేయ మైన క్రీడా స్ఫూర్తితో విజయవంతంగా ముగిసింది. ఇది కేవలం ఒక క్రీడా పోటీలుగానే కాక, ఓర్పు, ఐక్యత, అవిశ్రాం తంగా రాణించాలనే తపనల పండుగగా సాగింది. ఉత్కంఠ భరితమైన ప్రారంభ మ్యాచ్ నుంచి ఉత్సాహభరి తమైన చివరి క్షణాల వరకు, టోర్నమెంట్ అద్భుతమైన విన్యాసాలు, ఉత్కంఠభరితంగా ఆటలను ప్రదర్శించడమే గాక, ఇందులో పాల్గొన్న వారందరిపై చెరగని ముద్ర వేసింది. గస్టో అంటే కేవలం గెలవడం, లేదా ఓడిపోవడం కాదని, ఇది పట్టుదల, స్నేహం, క్రీడల ద్వారా జీవితంలోని గొప్ప పాఠాలను నేర్చు కోవడంగా నిర్వాహకులు అభివ ర్ణించారు. జీవితంలోని ప్రతి రంగంలోనూ బృంద కృషి, అంకితభావం, క్రీడా స్ఫూర్తి యొక్క విలువలను ముందుకు తీసుకెళ్లాలని వారు అభిలా షించారు. ఇది విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు పేరునా కృతజ్ఞతలు తెలియ జేశారు. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, బీటెక్ తొలి ఏడాది సమన్వ యకర్త డాక్టర్ పి.త్రినాథరావు, క్రీడల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.నారాయణరావు చౌదరి, మేనేజర్ తపస్వి తదితరులు విజేతలకు క్రీడా ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. బ్యాడ్మింటన్ (డబుల్స్) విజేత కేఎల్ యూ-హైదరాబాద్, రెండో స్థానం గీతం బాస్కెట్ బాల్ (పురుషులు) విజేత మహీంద్రా విశ్వవి ద్యాల యం, రెండో స్థానం గీతం కబడ్డీ (మహిళలు) విజేత గీతం, రెండో స్థానం ఎంఆర్ సీఈటీ కబడ్డీ (పురుషులు) విజేత ఎంఎల్ఆర్ఎటీ, రెండో స్థానం గీతం టేబుల్ టెన్నిస్ (పురు షులు-సింగిల్స్) విజేత ఎం-సీఈటీ, రెండో స్థానం శ్రీనిధి, టేబుల్ టెన్నిస్ (పురుషులు-డబుల్స్) విజేత ఎం-సీఈటీ, రెండో స్థానం గీతం టేబు ల్ టెన్నిస్ (మహిళలు-సింగిల్స్) విజేత అవినాష్ కళాశాల, రెండో స్థానం కేఎస్ఆర్ యూహె చ్ఎస్రో బాల్ విజేత గీతం, రెండో స్థానం మహీంద్రా విశ్వవి ద్యాలయం వాలీబాల్ విజేత ఎంఆర్ సీఈటీ, రెండో స్థానం గీతం క్రికెట్ విజేత ఎస్ఆర్ సీఈటీ, రెండో స్థానం వీజేఐటీ ఫుట్ బాల్ (పురుషులు) విజేత మహీంద్రా విశ్వవిద్యాలయం, రెండో స్థానం గీతం విద్యార్థులు సాధించారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థిని ఓంకారిణి పాండే సమన్వయం చేశారు. గస్టో-2025ని మరపురాని అనుభవంగా మార్చడంలో సహ కరించిన ప్రతి ఒక్కరికీకృతజ్ఞతలు తెలిపారు. గస్టో 2026ను మరింత ఉన్నతంగా, సాటిలేని ఉత్సవంగా, క్రీడా నైపుణ్యాల ను ప్రదర్శించే సిసలైనవేదికగా నిలపాలని అభిలాషించారు.



'ప్రమాదంలో మహిళల హక్కులు-మన కర్తవ్యం'

మహిళా దినోత్సవం సందర్భంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో సదస్సు



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ప్రమాదం లో మహిళల హక్కులు-మన కర్తవ్యం' అనే అంశంపై సంగారెడ్డి పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో మహిళా సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తలుగా హాజరైన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.అరుణశ్రీ, డాక్టర్ లలిత ఫెర్టిలిటీ హాస్పి టల్, అడ్వకేట్స్ సౌజన్య, సుమయ్య మాట్లాడుతూ.. ప్రభు త్వాలు మహిళలకు పని ప్రదేశంలో, ప్రయాణాల్లో, కుటుం బంలో రక్షణ కోసం నిర్భయ చట్టం, గృహింస చట్టం, వరక ట్న నిషేధ చట్టం తీసుకొచ్చాయన్నారు. అయితే వాటి అమ లులో మాత్రం జాప్యం జరుగుతున్నదని.. కొన్ని సందర్భాల్లో అమలుకు నోచుకోకపోవడం లేదన్నారు. మహిళ ఉపాధ్యా యులు, ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు కనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కేజీబీవీలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయు లకు బేసిక్ పే వర్తింపజేయాలని, ఔట్సోర్సింగ్‌లో పనిచేస్తున్న మోడల్ స్కూల్ టీచర్స్, అన్ని రకాల రెసిడెన్షియల్ స్కూళ్ల టీచర్స్‌కి సమాన పనికి సమాన వేతనం అందించాలని, హెల్త్ కార్డ్స్ ఇచ్చి ఉచిత వైద్యం కల్పిం చాలని డిమాండ్ చేశారు. సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న వివక్షత, లైంగికదాడులు, హత్యలు ఆపడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు వేగవంతం కావాలని, అలా జరిగినప్పుడే చైతన్యవంతమైన మహిళ దేశాభివృద్ధిలో సింహభాగం తన తోడ్పాటును అందించగల దన్నారు. అలాంటి పరిస్థితులకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని ఈ సమాజాన్ని నడిపించాల్సిన అవసరం ఉన్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నట్టుగా మహిళా ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం కూడా 2 ఏండ్ల చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వాలని అన్నిచోట్ల సౌకర్యాలు కల్పించాలని, ఆడపిల్లలు చదువును మధ్యలో ఆపకుండా కొనసాగించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఆత్మ రక్షణ కోసం అన్ని పాఠశాలల్లో కరాటే లాంటి కోర్సులు నేర్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.సువర్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు అమరేశ్వరి, జిల్లా కార్యదర్శిలు వి.అనురాధ, కృష్ణకుమారి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ప్రసన్న, ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జి. విశాలి, టీఎస్‌యూటీఎఫ్ కేజీబీవీ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు విశాలాక్షి, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు నాగ మణి, సౌభాగ్య, ఎం. సుచరిత, రాజేశ్వరి, ఉమారాణి జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు కాశీనాథ్ జాదవ్, జిల్లా కోశాధికారిశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆశా'పై లైంగికదాడి నిందితున్ని కఠినంగా శిక్షించాలి

- బాధితురాలికి సత్వర న్యాయం చేయాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు

నవతెలంగాణ-సంగారెడ్డి

జగిత్యాలలో ఆశా వర్కర్‌పై లైంగికదాడికి పాల్పడిని నిందితున్ని కఠినంగా శిక్షించాలని, బాధితురాలికి సత్వర న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక న్యూ బస్టాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిందితున్ని ఎస్సీ, ఎస్టీ చట్టంలోని సెక్షన్స్ ప్రకారం కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత ఆశా వర్కర్‌కు చట్ట ప్రకారం కాంపన్సేషన్ ఇవ్వాలని, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జగిత్యాలలో జరిగిన ఈ సంఘటన అత్యంత బాధాకరమని.. సిగ్గుచేటని అన్నారు. ఇలాంటి సంఘటనలు దేశంలో క్షీణిస్తున్న శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతున్నాయన్నారు. బేటీ బచావో బేటీ పఢావో లాంటి పథకాల ద్వారా మహిళలను ప్రసన్నం చేసుకోజూస్తున్న ప్రభుత్వం దేశంలో మహిళలకు, చిన్నారులకు రక్షణ, భద్రత కల్పించడంలో సంపూర్ణంగా విఫలమైందన్నారు. ఓవైపు మహిళలు పగటి పూట పని చేస్తుంటేనే రక్షణ కరువైన పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వం మరో వైపు పాత కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తూ మహిళలు రాత్రుల్లు కూడా పని చేయాలనడం మహిళల రక్షణను గాలికొదలడమే అవుతుందన్నారు. కాబట్టి కొత్త లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, పాత కార్మి చట్టాలనే బే షరతుగా కొనసాగించాలన్నారు. షీ టీంలు, సఖి సెంటర్ల వలన ఎంత మందికి సర్వీసు అందుతుందని, వాటి సంఖ్యను పెంచాలన్నారు. మహిళల రక్షణ కోసం పోలీసు బలగాల్లో మహిళా సిబ్బంది కేవలం 10శాతం మాత్రమేఉందని, మహిళా సిబ్బందిని 33 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాల న్నారు. నిర్భయకు నిధులు సరిపడా లేవనీ, దిశ చట్టం యా పు వరకే పరిమితమైందని విమర్శించారు. కాబట్టి మహిళల రాత్రి షిఫ్టులను రద్దు చేయాలని, రోజుకు ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు చేయాలన్నారు. గర్భిణీ స్త్రీల ప్రసవం కోసం అర్ధరాత్రుల్లో సైతం పేషంటుతో దవాఖానాకు వెళ్లేలా నిబంధనలు పెట్టారని ఈ నిబంధన సవరించి ఆశాలతో రాత్రి పూట అదనపు పనులు చేపించే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. ఆశాలందరికీ రక్షణ కల్పించాలన్నారు. కాగా లైంగికదాడికి గురైన బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని, మెరుగైన వైద్యం అందించి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని, బాధితురాలి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంగ, శశికళ , ఏసుమని, గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సమస్యల వలయంలో రామచంద్రరెడ్డికాలనీ

- 6 నెలలవుతున్న బోర్ రిపేరింగ్ చేయలేని పరిస్థితి
- వెంటనే సమస్యలన్నింటని పరిష్కరించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని రామచంద్రారెడ్డి కాలనీ సమస్యల వలయంలో సతమతమవుతున్నదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. కాలనీలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) బృందం శనివారం రామచంద్రరెడ్డి కాలనీ పర్యటించి.. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. రామచంద్రరెడ్డి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందాయని విమర్శించారు. రేషన్‌కార్డులు, వితం తు, వృద్ధాప్య పెన్షన్లు అందక పేదవాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇల్లు లేని పేదలకు ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పంది ంచి కాలనీలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. బోర్‌కు మరమ్మతులు చేయాలన్నారు. లేని యెడల సమస్యలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహి స్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సంగారెడ్డి ఏరియా కార్యదర్శి ఎం.యాదగిరి కాలనీవాసులు, పద్మమ్మ సుజాత, రజిత, సునీత మానెమ్మ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా హామీల అమలులో ప్రభుత్వం విఫలం




నవతెలంగాణ-జహీరాబాద్

మహిళల హామీలను అమలు పరచడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నామా సుభద్రమ్మ ట్రస్ట్ నిర్వాహకురాలు నామా స్రవంతి రవికుమార్ ఆరోపించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా జరిపారు. ఈ వేడుక లను నామా సుభద్రమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నామ స్రవంతి - రవి కిరణ్ దంపతులు కేక్ కట్ చేసి, మహిళల నాయకులకు సన్మానించి జ్ఞాపికలను అందజేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మహిళల హక్కులు, అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు గురించి ప్రస్తావించారు. గతంలో మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ పాలనలో మహిళల కోసం అమలు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, న్యూట్రిషన్ కిట్లు, సున్నా వడ్డీకే రుణాలు వంటి పథకాల గురించి వివరించారు. ఇక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన మహాలక్ష్మి, గృహజ్యోతి, సున్నా వడ్డీకే రుణాలు, విద్యార్థినులకు స్కూటీలు వంటి వాగ్దానాలను ప్రతిఒక్క మహిళకు న్యాయంగా అందించాలని కోరారు. ప్రభుత్వాలు మారినా మహిళా సంక్షేమ పథకాల్లో కోతలు లేకుండా వాటిని పూర్తిగా అమలు చేయడం అత్యంత కీలకమన్నారు. మహిళలు ఏ రంగంలోనైనా ముందుండే శక్తిగా మారా లన్నారు. కుటుంబమే కాదు, సమాజ అభివృద్ధిలోనూ మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వారికి ఆర్థిక స్వావలంబన, విద్యా, ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేయాలన్నారు. ఒక మహిళ చదువుకుంటే, ఒక కుటుంబం చదువుకుంటుంది. ఒక మహిళ ఆర్థికంగా ఎదిగితే, ఒక సమాజం ఎదుగుతుంది' అనే సిద్ధాంతాన్ని ప్రభుత్వాలు గమనించి, మహిళల సాధికారతకు మరింత బలమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు పట్టణ మహిళా అధ్యక్షురాలు మంజుల, ప్రముఖ మహిళ న్యాయవాదులు అనూష, బుజ్జవ మ్మ, మాజీ కౌన్సిలర్ బండి రంగమ్మ మహిళా నాయకురాలు ఉల్లిగడ్డ పద్మజ నామా సుభద్రమ్మ మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై అమీన్‌పూర్ ఫోకస్

ఇప్పటికే 104 మందికి 25 శాతం రాయితీ



నవతెలంగాణ-అమీన్‌పూర్

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై అమీన్‌పూర్ మున్సిపాలిటీ ఫుల్ ఫోకస్ పెట్టింది. అందులో భాగంగానే మున్సిపాల్టీ పరిధిలోని ప్రజలకు ఎల్ఆర్ఎస్‌పై పూర్తి అవగాహన కల్పించారు. అందులో భాగంగానే తాజాగా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకుని ఫీజు చెల్లించిన లబ్దిదారులకు 25 శాతం రాయితీని అందజేసింది. ఈ సందర్భంగా అమీన్‌పూర్ మున్సిపాల్టీ టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన 104 మంది దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీని కల్పించామన్నారు. ఎల్ఆర్ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందుకోసం వాహనాలకు మైకులు పెట్టి ప్రచారం కల్పించడంతో పాటు దరఖాస్తుదారులకు ఫోన్ ద్వారా సైతం అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. మార్చి 31లోపు దరఖాస్తుదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళా రైతులకు ఘన సన్మానం



నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలోని ఎదురు గూడెం ఆమ్లెట్ విలేజ్లో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి.. మహిళా రైతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కే.రాజయ్య మాట్లాడుతూ.. స్వతంత్ర ఉద్యమంలో కూడా మహిళల పాత్ర చాలా కీలకంగా ఉందన్నారు. ప్రతీ మహిళ కూడా పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. వ్యవసాయం, ఉద్యోగాల్లో, వ్యాపారంతోపాటు ఉన్నతమైన పదవుల్లోనూ మహిళలు రాణించాల న్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు యేసు రత్నం, రైతు మహిళలు బి.పద్మ, పి.శాంతమ్మ, పేట లక్ష్మి, కర్ణమ్మ, మల్లేశ్వరి, దీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎండల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి



నవతెలంగాణ-న్యాల్‌కల్

వేసవి ఎండల పట్ల ప్రజలు తప్పనిసరిగా తగు జాగ్రత్తలు పాటించాలని మిర్జాపూర్(బి) ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు ప్రియాంక సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎండలు విపరీతంగా కొడుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీహైడ్రేషన్ కాకుండా తాగునీరు ఎక్కువగా తాగాలన్నారు. అవసరమైతే తప్పా మధ్యాహ్నం సమయంలో బయటికి వెళ్లొద్దన్నారు. అత్యవసరమైతే గొడుగు పట్టుకుని బయటికి వెళ్లాలన్నారు. నీడ ప్రాంతంలో ఎక్కువగా ఉండాలన్నారు. వేసవిలో ఎక్కువగా పుచ్చకాయ పండ్లు, దానిమ్మ, చెరుకు రసం తీసుకోవాలన్నారు. ఎండలోకి వెళ్లి వచ్చిన తర్వాత వెంటనే నీరు తీసుకోకుండా..15 నిమిషాల తర్వాత తీసుకోవాల న్నారు. మిర్జాపూర్(బి) ఆస్పత్రిలో షుగర్, కిడ్నీ, టైఫాయిడ్, మలేరియా పలు రకాల రక్త పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. నిత్యం 220 మంది రోగులకు వైద్యం అందిస్తున్నామన్నారు.



మృతుడి కుటుంబానికి గ్రామస్తుల ఆర్థికసాయం

నవతెలంగాణ-కంగ్టి

మండల కేంద్రమైన కంగ్టి గ్రామా నికి చెందిన మెండే శ్రీకాంత్‌రెడ్డి పిచ్చి కుక్కల దాడిలో గాయపడి చికత్స పొందుతూ ఇటీవలే మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో అతడి తల్లి అనాథై.. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నది. ఇది చూసిన గ్రామ స్తులు చలించిపోయి ఆర్థిక సాయం చేయడానికి ఒక్కొక్కరుగా ముందుకొచ్చారు. అలా యువత, గ్రామస్తులు, పెద్దలు ముందుకొచ్చి అందరూ కలిసి రూ.55.500 ఆర్థిక సాయాన్ని మృతుని తల్లికి మాజీ సర్పంచ్ కృష్ణ ముదిరాజ్ చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ కార్య క్రమంలో గ్రామస్తులు రఘు, శెట్కార్ విజయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా చైతన్యమే సమాజాభివృద్ధికి సోపానం

నవతెలంగాణ-కొండాపూర్

మహిళలు చైతన్యవంతం అయిన ప్పుడే సమాజంలో అభివృద్ధి సాధ్యమ వుతుందని గ్రామీణ జాతీయ ఉపాధి హామీ గంగారం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ రవి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహి ళా దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సాధికారత దిశగా ముందుగా పోవాలని ఆకాంక్షించారు. పని ప్రదేశంలో ఒకరికొకరు మహిళలు స్వీట్లు తినిపించుకున్నారు.



డాక్టర్ ఉషా కిరణ్‌కి సన్మానం

నవతెలంగాణ-సంగారెడ్డి

అంతర్జాతీయ మహిళా దినోత్స వాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలో సీనియర్ స్త్రీ వైద్యనిపురాలు డాక్టర్ ఉషా కిరణ్‌ని తెలంగాణ అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు కొండాపురం జగన్ ఆధ్వర్యంలో శాలువాతో, మెమొంటోతో ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు కొండాపురం జగన్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు పంబల్ల దుర్గాప్రసాద్, గౌరవ అధ్యక్షులు బైండ్ల అశోక్ కుమార్, మహిళా నాయకురాలు లలితా రాణి, స్వర్ణలత, జిల్లా నాయకులు మొగులయ్య, సురేష్, రవీందర్, రమేష్, సదానందం, నాగేష్ , తరుణ్, శ్రీకాంత్, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ వాగ్దేవి హైస్కూల్లో ఘనంగా మహిళా దినోత్సవం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని శ్రీ వాగ్దేవి హై స్కూల్లో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి బహుమతులు అందజేశారు. ఈ సంద ర్భంగా శ్రీ వాగ్దేవి హైస్కూల్ కరస్పాండెంట్ అబ్బవరం ఉదయ్ భాస్కర్ రెడ్డి మా ట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా అభివృద్ధి చెందారన్నారు. ఎక్కడైతే మహిళలు పూజింప పడుతారో అక్కడ దేవతలు ఉంటారన్నారు.కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పద్మనాభ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలోని శ్రీ పద్మనాభ డిగ్రీ కళాశాలలో అంతర్జా తీయ మహిళా దినోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించినట్టు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సృష్టికి మూలం స్త్రీ.. ఎనలేని సేవలను సమాజానికి అందించడంలో స్త్రీలపాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. కళాశాల మహిళా అధ్యాపకులను విద్యార్థులు శాలువాతో సన్మానించి కేక్‌కట్ చేశారు. అదేవిధంగా విద్యార్థులతో ఉపన్యాస పోట లను నిర్వహించి వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలోకళాశాల యాజమాన్య బృందం,అధ్యాపకబృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను కొట్టిన ఉపాధ్యాయురాలిపై చర్య తీసుకోవాలి



నవతెలంగాణ-కంగ్టి

పూల చెట్లకు నీళ్ల పోయలేదని మండల కేంద్రమైన కంగ్టి కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులను కొట్టిన మ్యాథ్స్ టీచర్ సురేఖ పై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కింది దొడ్డి సతీష్ డిమాండ్ చేశారు. మోకాళ్ళపై, మోచేతిపై కొట్టడంతో కాళ్ళు చేతులకు తీవ్ర గాయా లయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులు ఇలా క్రూరంగా కొట్టి కనీసం హాఆసుపత్రికి సైతం తీసుకెళ్లకుండా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. జరిగిన విషయం బయటికి రాకుండ జాగ్రత పడడం ఏంటని ప్రశ్నించారు. జిల్లా అధికారులు స్పందించి సదరు ఉపాధ్యాయురాలుపై చర్యలు తీసుకోవాలని కోరాఉ. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శురేష్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 14307 కేసులు పరిష్కారం



నవతెలంగాణ-సంగారెడ్డి

జాతీయ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాలతో సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో సంగారెడ్డి కోర్ట్ ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్ జి. భవాని చంద్ర మాట్లాడుతూ.. రాజీ చేయదగ్గ పోలీస్ కేసులు, భార్యాభర్తల చిన్నచిన్న వివాదాలు, ఎక్సైజ్ కేసులు, బ్యాంక్ కేసులు తదితర కేసులు రాజీ చేయదగ్గ కేసుల్లో ఇరువర్గాలు లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చు కోవచ్చు అన్నారు. క్షణ కావేశంలో ఇరువర్గాలు చిన్న చిన్న తగాదాలు పడి కేసులు నమోదు జరిగి కోర్టు చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా రాజీచేసుకుని సామరస్యంగా స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. కాగా ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కాంపౌండేల్ కేసులు 13715, సివిల్ కేసులు 12, మోటారు వాహన ప్రమాద పరిహారం కేసులు 32, రూ.17697000, ప్రీ లిటిగేషన్ కేసులు 10, బ్యాంకు రికవరీ కేసులు 254 , రూ.17691867, సైబర్ క్రైమ్ కేసులు 102, రూ. 730470, భూసేకరణ కేసులు 1, రూ. 6244347 విద్యుత్ చౌర్యం నిరోధక కేసులు 181, రూ.525000 మొత్తం 14307 కేసులుపరిష్కారం అయ న్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు సెషన్ జడ్జి సంగారెడ్డి కే.జయంతి, జిల్లా మూడో అదనపు సెషన్స్ జడ్జి సంగారెడ్డి, జి.సునీత రవీంద్రరెడ్డి, రెండో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి, సంగారెడ్డి డా.పి.పి.కృష్టార్జున్, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి సంగారెడ్డి రాధాకృష్ణ చౌహాన్,జిల్లా ప్రధాన న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ ,ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, సంగారెడ్డి ఆర్. అనిత, సంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, గవర్నమెంట్ ప్లీడర్ సంగారెడ్డి ప్రభు ధాన్యం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంగారెడ్డి సత్యనారాయణ, జిల్లా రెవెన్యూ అధికారి, సంగారెడ్డి పద్మజా రాణి తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ, డాక్టర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకథాన్

- సర్వైకల్ క్యాన్సర్ నివారణ, హెచ్‌పివి వ్యాక్సిన్ డ్రైవ్‌పై అవగాహన కల్పించేందుకు కృషి
- ముఖ్య అతిథిగా హాజరైన టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



నవతెలంగాణ-సంగారెడ్డి

సర్వైకల్ క్యాన్సర్ నివారణ, హెచ్‌పివి వ్యాక్సిన్ డ్రైవ్‌పై అవగాహన పెంపొందించేందుకు ఐఎంఏ సంగారెడ్డి, సంగారెడ్డి డాక్టర్స్ క్లబ్ సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంద ర్భంగా స్థానిక ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు వాకథాన్ నిర్వహించారు. కాగా ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దీప ప్రజ్వలన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా టీజీఐఐసి చైర్మన్ టి.నిర్మల జగ్గారెడ్డి హాజరై మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్య పరిరక్షణలో ముందు జాగ్రత్తలు తీసుకోవడం ఎంత ముఖ్యమన్నారు. ఐఎంఏ సంగారెడ్డి అధ్యక్షులు డా.కె.కిరణ్ కుమార్ మాటా డుతూ.. సర్వైకల్ క్యాన్సర్ నుండి రక్షణ పొందేందుకు తదుపరి జాగ్రత్తలు, స్క్రీనింగ్, వ్యాక్సినేషన్ కీలకమైనవన్నారు. జనరల్ సెక్రెటరీ డా.ఎస్.ఆనంద్, ప్రెసిడెంట్-ఎలెక్ట్ (2026) డా. రాజు గౌడ్‌లు మాట్లాడుతూ.. ఐఎంఏ ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు తమ కృషి కొనసాగిస్తామన్నారు.ఈ వాకథాన్‌లో భాగంగా హెచ్ పి వి వ్యాక్సిన్ డ్రైవ్‌ను ప్రారంభించగా, మహిళలు సర్వైకల్ క్యాన్సర్ నుండి రక్షణ పొందేందుకు ఈ వ్యాక్సిన్ చాలా ప్రాముఖ్యత కలిగి ఉందని వైద్యులు వివరించారు. ఐఎంఏ సంగారెడ్డి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలను చేపట్టేందుకు కట్టుబడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డా. సురేష్, డా. శ్రీధర్, డా.వరశురామ్, డా. వెంకట్, డా.గాయత్రి, డా.ఉషా కిరణ్, డా.లలిత, డా. శైలజ, డా.జ్యోతిర్మయి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో పోరాటాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో మహిళా సమస్యలపై పోరాటాలు నిర్వహిద్దాం అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. నరసింహులు పిలుపుని చ్చారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుందర య్య భవన్లో అంత ర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.రామచందర్, ఎం. నర్సిములు, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎ.అమృతమ్మలు మాటా డుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో మహిళా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. మహిళా సాధికారత, మహిళలు విద్య పరంగా, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షి ంచారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో స్త్రీ, పురుష సమా నత్వం కోసం దోపిడీ,అసమానతలు లేని సమాజం కోసం ఉద్యమిం చాలన్నారు. మహిళల శ్రమను గుర్తిద్దాం, మహిళల శ్రమను గౌరవిద్దాం, మహిళలపై హింస, వేధింపులను ప్రతిఘటించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, పని భద్రత కోసం పోరాడుదామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుజాత, షబానా, మమత, మంజుల, జంగమ్మ, చిలకమ్మా తదితరులు పాల్గొన్నారు.

బర్దిపూర్ అవధూత పీఠం పీఠాధిపతి రథయాత్ర



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లా పరిధిలోని బర్దీపూర్ దత్త పీఠం పీఠాధిపతులు శ్రీ దత్తగిరి మహారాజ్ సిద్దేశ్వరానందగిరి మారాజుల రథ యాత్రను శనివారం నిర్వహించారు. సంగారెడ్డిలోని దత్తగిరి ఆశ్రమం నుండి కంది మండల పరిసరాల్లో గల ఎస్ఎస్ ఫంక్షన్ హాల్ వరకు ఈ రథయాత్ర కొనసాగింది. ఇటీవల ప్రయాగరాజ్ మహాకుంభమేళాలో బర్దిపూర్ సిద్దేశ్వరానంద గిరి మారాజుకు 1008 మహా మండలేశ్వర్ అని బిరుదులు ఇచ్చి సత్కరిం చడం జరిగిందని.. ఆ శుభ తరుణాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలో వీరశైవ జంగమ సమాజం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సంగారెడ్డిలోని వీరశైవ జంగమ సమాజంతో పాటు అన్ని వర్గాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా అప్ప మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అందరూ ఐక్యంగా ఉండి సనాతన ధర్మాన్ని కాపాడాలన్నారు. 41 రోజులపాటు త్రివేణి సంఘంలో 66 కోట్ల మంది భక్తుల పుణ్యస్నానాలు చేశారని అన్నారు. అంత మందికి ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం తోపాటు ప్రభుత్వానికి సహకరించిన అనేక అకాడాలను వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అక్కడికి చేరుకున్న అందరి భక్తులకు ఉండేందుకు స్థానంతో పాటు భోజన ఏర్పాట్లను కూడా దత్తగిరి ఆశ్రమం తరపున ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం భక్తులందరికీ త్రివేణి సంగమం నుండి తెచ్చిన తీర్థ ప్రసాదాన్ని అందించారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మడుపతి వీరేశం, ప్రధాన కార్యదర్శి శివ కుమార్, గంగాధర్, మడుపతి మహేశ్వర్, విశ్వ ప్రసాద్, సోమనాథ్, శివప్రసాద్, చంద్రశేఖర్, విజయభాస్కర్, బసవేశ్వర్, సురేష్, ప్రభాకర్, వైద్యనాథ్, బిక్షపతి, అల్లాడి వీరేశం, తదితరులు పాల్గొన్నారు

జోగిపేటలో ఘనంగా మహిళ దినోత్సవ వేడుకలు





నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట పట్టణంలో ప్రపంచ మహిళ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ ఆధ్వర్యంలో మహిళలను ఘనంగా సన్మానించారు. ఇందులో సీఐటీయూ నాయకులు రాములు, మహిళ నాయకులు యశోద, శిరీష, నిర్మల, కమల, పరిశుద్ధ, లక్ష్మిలు ఉన్నారు.

జోగిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళ ఉపాధ్యా యులకు ఘనంగా సన్మానించారు. ఇందులో పాంశాల ప్రధానోపాధ్యా యులు ఎన్ నరేష్ కుమార్, మహిళా ఉపాధ్యాయులు సుభద్రాంగిదేవి, అమృత, సరితాకుమారి, విజయనిరీక్షణ, సరిత, రేణుక, మంజుల, నాగరాణి, శ్రీలేఖలను ఘనంగా శాలువా, జ్ఞాపిక లతో సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఎ.మాణయ్య, మంజ్యానాయక్, రాములు, అనిల్ కుమార్, త్రినాధ్, నరోత్తమ్ కుమార్, చంటి చంద్రశేఖర్, హన్మంత్ రాజ్, లక్ష్మణ్, రవికుమార్, రమేష్ కుమార్, ఎ.చంద్రశేఖర్, వి.బి.శ్రీనివాస్ ఉన్నారు. అందోల్ జోగిపేట పురపాలక సంఘంలో మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కమిషనర్ తిరుపతి, సీనియర్ అసిస్టెంట్ బి. శ్రీధర్, ఆర్ఐ నారాయణ ఉన్నారు. జోగిపేట కోర్టులో జడ్జి ధనలక్ష్మి, మహిళ ఉద్యోగులను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఇందులో ఏజీపీ షంషీర్ బేగ్, న్యాయవాదులు కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, వర్మ, అల్లే శ్రీకాంత్, వెంకటకృష్ణ, మలేశం ఉన్నారు. జోగిపేట ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో ఘనంగా నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య, ఫార్మసిస్ట్ గ్రేడ్ 1 సెల్వరాని, నర్సింగ్ సూపర్డెంట్ సునంద, హెడ్ నర్స్ గ్రేసి విలాసిని, కృష్ణకుమారి, సుగంధ, శకుంతల, నర్సింగ్ ఆఫీసర్స్ శ్రీవాణి, వీణ , భవ్య శ్రీ, తులసి, అంజమ్మ, భీమ్ రాజ్, ప్రవీణ్, సురేష్‌లు ఉన్నారు. టీఎస్ జీఆర్ఈఏ జోగిపేట అందోల్ మండల శాఖ విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో మహిళ పోలీసులకు, ప్రభుత్వ ఆసుపత్రి నర్సులకు ఘనంగా సన్మానించారు. ఇందులో ఎస్ఐ పాండు, అందోలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ప్రేమ్ కుమార్, యం మనోహర్ ప్రసాద్‌లతో పాటు పలువురు ఉన్నారు.

అమీన్‌పూర్ ప్రధాన రోడ్డు సమస్యను పరిష్కరించండి

- పీపుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపీకి వినతిపత్రం



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ ప్రధాన రహదారి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పీపుల్ అసోసియేషన్ సభ్యులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు శనివారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. గత కొద్ది రోజులుగా అమీన్‌పూర్ నుంచి బంధం కొమ్మమీదుగా లింగంపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీని కోరినట్టు చెప్పారు. దానికి ఎంపీ సానుకూలంగా స్పందించి వెంటనే అధికారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్య వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో పీపుల్ అసోసియేషన్ సభ్యులు తిరుమల రెడ్డి, లక్ష్మణ్, మహేశ్వర్‌రెడ్డి,ఉదయ్‌కుమార్,వెంకట పుల్లారెడ్డి, వెంకట కృష్ణ, రఘు, రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని, రాణించాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీ య మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్నే నిర్వహించినట్టు చెప్పారు. మహిళలు రాజకీయంగా, విద్యాపరంగా అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. మహిళలు ఇంటి గౌరవాన్ని కాపాడుతా రని, ముఖ్యంగా మహిళలు విద్య పట్ల ఎక్కువ శ్రద్ధ చూపించి మంచి ఉన్నత స్థాయిలో ఎదగాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని ఒక గొప్ప సంకల్పంతో ముందుకు వెళ్తున్నదన్నారు. మహిళా సంఘాలకు డ్వాక్రా రుణాలను ఇచ్చి మహిళలకు ఉపాధి అవకాశం కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటాపోటీలు, సంగీతం, నృత్యాల పోటీలను నిర్వహిం చారు. పోటీల్లో గెలుపొందిన మహిళల అందరికీ బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ఎమ్మెల్యేకు మహిళల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, పట్లోళ్ల అనుపమ రెడ్డి, ఆనంద్ స్వరూప్ శేట్కర్, తాజా మాజీ మున్సిపల్ చైర్మెన్, దారం శంకర్ సెట్ తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్, మాజీ కౌన్సిలర్లు,రమేష్ చౌహాన్, సంగన్న న్యాయవాది తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నవతెలంగాణ-అమీన్‌పూర్

మహిళలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని.. ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి. నాగేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బీరంగూ డలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికీ మహిళల పట్ల అనేక దాడులు జరుగుతున్నాయన్నారు. గత రెండు రోజుల క్రితం జగిత్యాలలో ఆశా వర్కర్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రైవేటు పరిశ్రమల్లో, వేలాదిమంది మహిళలు పనిచేస్తున్నా.. వారికి ఉద్యోగ భద్రత కల్పించడంలో అటు ప్రభుత్వం, ఇటు పరిశ్రమల యాజ మాన్యాలు పూర్తిగా విఫలమవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ విషయంలో కూడా మహిళా కార్మికులకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న వివక్ష పట్ల పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. మహిళా ఉద్యోగస్తులకు కార్మికులకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు కూడా చెల్లించాలన్నారు. ప్రభుత్వ రంగంలో కూడా మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి రిజర్వేషన్లు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అర్జున్, జయరాం,వీరస్వామి, సంతోష, తదితరులు పాల్గొన్నారు.

ఆచార్యాలో డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం



నవతెలంగాణ-జహీరాబాద్

ఆచార్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ హరికుమార్ జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజంలో పురుషులతో సమానంగా నైపుణ్యాన్ని కలిగి అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్నారన్నారు. గాంధీజీ కలలు కన్నా మహిళ ఉన్నతి భారతీయ సమాజంలో కనబడుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉపన్యాసకురాలను కళాశాల యజమాన్యం సత్కరించారుజ. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జి.శ్రీనివాస్ రెడ్డి, జి.రేణుక రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నందుగౌడ్ దత్తు, నికిత అధ్యాపకులు నర్సింలు, రమేష్, నవీన, లావణ్య, ఇస్రత్ సుల్తానా, సలమా, కీర్తి, నికిత, శ్రావిక శిరీష విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డిని సన్మానించిన మండల నాయకులు



నవతెలంగాణ-జోగిపేట

మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి డాక్టర్ సి.అంజిరెడ్డిని పార్టీ అందోల్ మండల నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఆయన నివాసానికి వెళ్లి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్య క్షులు ఆర్.ప్రభాకర్ గౌడ్, మండల నాయకులు జే. ప్రభాత్ కుమార్, శ్యామ గౌడ్, మానయ్య, నర్సింలు, ఉలువల వెంకటేశం, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



సమాజంలో మహిళల పాత్ర కీలకం

నవతెలంగాణ-కొండాపూర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మల్లేపల్లి గ్రామపంచాయతీలో కార్యదర్శి కటకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళా గ్రామసభ శనివారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం లో మహిళా సమస్యలు వాటి పరిష్కారం గురించి చర్చించడం మహిళలతో చర్చించారు. డ్వాక్రా గ్రూపులో తీసుకొనే లోన్లు సమయానికి కడుతూ.. నూతన లోన్ తీసకొని వ్యాపారం చేసి అభివృద్ధి మహిళ సాధికారతకు, అభివృద్ధివైపు దిశగా నడవాలని కోరారు. ఈ సమావేశంలో విఓ లీడర్స్ సత్య, విజయలక్ష్మి, కమలమ్మ, దేవమ్మ రాణి,అంగన్వాడీ టీచర్స్ లావణ్య మంజుల గ్రూప్ సభ్యులు స్వప్న, లక్ష్మి, మంజుల, సంగమ్మ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE II ADDL JUNIOR CIVIL JUDGE CUM (SPECIAL MOBILE COURT) AT SANGAREDDY

O.S No: 1002 OF 2024

Between:

1. Deepali Bansal W/o Late Raghav Bansal
2. Yuvaansh Bansal S/o Late Raghav
3. Suman Agarwal W/o Surender Agarwal
4. Surender Agarwal S/o Laxmi Narayan Agarwal

(Plaintiff- 2, Being a minor rep by Plaintiff-1, Mother, his natural Guardian)

All are R/o Plot no.32/A, Phase-III, Mandal: Quthbullapur, District: Medchal-Malkajgiri- 500055

...Plaintiffs

AND

1. The Tahsildar / MRO Gummadidala Mandal, Sangareddy Dist.
2. All concerned

...Defendants 1&2

WHEREAS the Plaintiffs have filed the above Suit to declare the plaintiffs as legal heirs of Late Sri Raghav Bansal, The said suit is posted to 26.03.2025 for your appearance. You are hereby required to appear on that day at 10.30 a.m. either in person or through a pleader, failing which the matter will be decided as per law.

//BY ORDER OF THE COURT//

VIJAY KUMAR
Advocate, Sangareddy
Mobile no. 8520922171 / 9440235231

IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT JUDGE AT: SANGA REDDY.

O.S.No. 134 OF 2024

Between:

Smt. ManukaMallamma& others.
...Petitioners/Plaintiffs

AND

Sri. Gorlakadi @ Cheernam Yadaiah.
...Respondents/Defendants

To,
K.Indrasena Reddy S/o K. Chandrasekhar Reddy, Aged 42 years, Occ: Pvt. Employee, R/o VK Plaza, Plot No. 105, Phase-1, Jayalakshmi Nagar, Beeramguda, Ameenpur village & Mandal, Sangareddy, TG

NOTICE

Take notice that the above-named plaintiff's filed the above suit against the above said you and other Defendants seekingsuit for Partition and Separate Possession and other Relief in respect of the suit schedule properties i.e., all that land Admeasuring Ac.0-06 gts in Sy.No. 11/రూ/1, Ac. 0-04 gts in Sy.No.12/ఒ, Ac. 1-18 gts in Sy. No. 13/ఊ/1, Ac. 0.06 gts in Sy. No. 14/రు/1, Ac. 0-03 gts in Sy. No.15/ఊ/1, Ac.0-14 gts in Sy. No.16/ఊ/1 situated at rendlagadda village, Ameenpur Mandal, Sangareddy District, Land Admeasuring Ac. 0-15 gts in Sy. No. 129/అ, Jankampet Village, Ameenpur Mandal, Sangareddy District, Land Admeasuring Ac.0-32 gts in Sy. No. 419/అ, Ac. 0-17 gts in Sy. No. 420/ఆ, Ac. 0-08 gts in Sy. No. 432/ఈ, Ac. 0-20 gts in Sy.No. 440/ఆ3, Ac.0-31 gts in Sy. No. 441/ఈ, Ac. 0-16 gts, in Sy.No.442/ఈ, Ac.1-05 gts in Sy.No.444/ఐ, Ac.0-10 gts in Sy.No.585/అ, situated at Madharam Village, Jinnaram Mandal, Sangareddy District and House Bearing No. 2-64, Admeasuring 280 Sq. yds situated at wadakpally H/o Jankampet Village, Ameenpur mandal, Sangareddy district, TG & also filed a Interlocutory Application vide I.A.No.459 of 2024 restraining the defendants from alienating in the suit schedule properties. The said Suit and I. A is posted to 27-03-2025 at 10:30 A.M for your appearance by person or through an advocate, failing which the case will be decided in your absence on merits against you.

// BY ORDER OF COURT //

C.VIKRAM,
Advocates, Sangareddy.

నవతెలంగాణ
మెదక్
3
ఆదివారం | 09 మార్చి 2025 | www.navatelangana.com

హైదరాబాద్‌కు తరలివెళ్లిన ఐకేపీ సభ్యులు

నవతెలంగాణ-శివ్వంపేట



రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐకేపీ సీసీ భాగ్యలక్ష్మి, వీఓఏ బుర్ర విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, సభ్యులు ఆర్టీసీ బస్సులలో ఉదయం నుండే పరేడ్ మైదానంలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సీసీ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశానుసారం, ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సురక్షితంగా డ్వాక్రా సభ్యులు ప్రయాణం చేసేందుకు వీలుగా ఆర్టీసీ బస్సులలో మహిళలను తరలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట వీఓఏ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు చీరల పంపిణీ

నవతెలంగాణ-నర్సాపూర్



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బీజేపీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి, అంజిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై మున్సిపల్ కార్మికులను శాలువాలతో సన్మానించి, చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్, రమణ రావు, బుచ్చేష్ యాదవ్, సురేష్, రాజేందర్, యాదగిరి మున్సిపాల్ కార్మికులు ఉన్నారు.

గంగమ్మ గుడిలో లైట్ల చోరీ

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్‌లో గంగమ్మ గుడి లైట్లను అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. పట్టణంలోని పెద్ద చెరువు కట్టపైన ఉన్న గంగమ్మ తల్లి దేవాలయం గుడిని అలంకరించిన లైట్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గంగపుత్ర సంఘం నాయకులు తెలిపారు. గతంలో కూడా లైట్లను చోరీ చేశారని, ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆలయంలోని లైట్లను పాత దొంగలే దొంగిలించి ఉండవచ్చని సంఘం నాయకులు గడప దేవేందర్, ఏరువా శ్రీనివాస్, ఏరువ బోయిన బిక్షపతి, నర్సింగరావులు అనుమానం వ్యక్తం చేశారు. ఆలయంలో లైట్లు చోరీ చేసిన దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని వారు పోలీసులను కోరారు.

సెంట్ ఆంథోనిస్ పాఠశాలలో ఘనంగా ఎస్ డి జి కార్యక్రమం



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి, విద్యానగర్ గల సెయింట్ ఆంథోనీస్ పాఠ శాలలో సస్టెయినబుల్ డెవలప్ మెంట్ గోల్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆంథోనీ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యా రంగం తో పాటు వివిధ రంగాలలో కూడా వారి యొక్క సృజనాత్మకతను, భాష నైపుణ్యాలను, ప్రతిభా పాటవాలను మెరుగు పరచుకోవాలని తెలియజేశారు. విద్యార్థులు నృత్య, నాటకాలను ప్రదర్శించారు.అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను పాఠశాల చైర్మన్ ఆంథోనీరెడ్డి ప్రిన్సిపాల్ ప్రమీలగారు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పరిశీలించి వారి యొక్క నైపుణ్యాలను తెలుసుకొని వారిని అభినందించారు.

రూ.35 లక్షలతో కొత్త విద్యుత్ లైన్

నవతెలంగాణ-పాపన్న పేట



పాపన్న పేట మండలంలో విద్యుత్ సమస్యలు తీర్చేందుకు రూ.35 లక్షల వ్యయంతో విద్యుత్ లైన్ వేస్తున్నట్లు చీఫ్ ఇంజనీర్ బాల స్వామి తెలిపారు. పొడిచన్ పల్లి ఫిడర్ ఎటువంటి ఇబ్బందులు ఏర్పడినా కొత్తపల్లి, గాంధారి పల్లి, పొడిచన్ పల్లి, నాగసాన్ పల్లి ఉపకేంద్రాలలో అంతరాయం ఏర్పడు తుందన్నారు. ఈ సమస్య తీర్చడానికి రూ.35 లక్షలతో కొడిపల్లి నుంచి 33 కేవీ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం పాపన్న పేట మండలంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు. ఆయన వెంట ఎస్ ఈ శంకర్, డీ ఈ చాంద్ పాషా, ఏ డీ ఈ శ్రీనివాస్, మోహన్ బాబు, ఏఈ నర్సింలు ఉన్నారు.

ప్లే స్కూల్ లో మహిళా దినోత్సవం

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్‌లోని ఆర్ట్ అండ్ స్మార్ట్ ప్లే స్కూల్‌లో మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా టీచర్లను ఆ స్కూల్ డైరెక్టర్ సైనత్ హుస్సేన్ ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా సైనత్ హుస్సేన్ మాట్లాడుతూ మహిళలను గౌరవించడం మనందరి బాధ్యతగా వ్యవహరించి సత్య మార్గంలో నడవాలని కోరారు. రాజకీయ, మానవీయ హక్కులు బలంగా వుండి మహిళల రాజకీయ, సామాజికహక్కులపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా టీచర్లు ఎం. మౌనిక, ఎం. రామలక్ష్మి, ఎం. శిరీష, ఎం.డి. షకీల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు




నవతెలంగాణ-సిద్దిపేట

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ మహిళ నాయకులను కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం కృషి చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించి, మహిళాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికలలో వారికి పెద్ద ఎత్తున రిజర్వేషన్‌లు కల్పిస్తారన్నారు. మహిళలను లక్షాధికారులుగా అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి అనేక కొత్త పథకాలను తీసుకువచ్చారని, ఆర్థిక సహకారం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు ముద్దం లక్ష్మి, నంగునూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తప్పట శంకర్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు వాహబ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు అజమాత్, కాంగ్రెస్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి మంద వనజ, కాంగ్రెస్ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పెరెట్ల సంతోష, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, సత్యనారాయణ, కవిత, శారద, రజని, సన తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డిని సన్మానించిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-నర్సాపూర్



ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొంది మొదట సారిగా నర్సాపూర్ వచ్చిన సందర్భంగా శనివారం నర్సాపూర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎమ్మెల్సీ అంజిరెడ్డిని శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమణారావు, బుచ్చేష్ యాదవ్, రాజేందర్, సురేష్, యాదగిరి, చంద్రం తదితరులు ఉన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఆధ్వర్యంలో...



పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొంది మొదటిసారిగా నర్సాపూర్ వచ్చిన సందర్భంగా శనివారం నర్సాపూర్‌లో మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఎమ్మెల్సీ అంజిరెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, నాయకులు అరవింద్ గౌడ్, రామ్ రెడ్డి, గుండం శంకర్, నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

భూగర్భ జలలు అడుగంటి పోవడంతో సన్నగిల్లిన బోర్లు



- నెర్రె బారిన నేలలు, ఎండుతున్న వరి పొలాలు
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు

నవతెలంగాణ-నిజాంపేట

భూగర్భ జలల్లో నీళ్ల లేక రైతుల పొలాల్లో బోర్ మోటార్లు పూర్తిగా తగ్గిపోయాయి. ఈ మేరకు మండల వ్యాప్తంగా నందగోకుల్, నస్కల్, చల్మెడ గ్రామాల్లో బోర్ మోటార్లు తగ్గుముఖం పట్టాయి. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వరి నాట్ల సమయంలో అధికంగా పోసిన బోరు మోటార్లు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో ఏమి చేయాలో అర్థం కాకా రైతులు తలలు పట్టుకుంటున్నారు. నంద గోకుల్ గ్రామానికి చెందిన రైతు చంద్రయ్య 2 ఎకరాల భూమిలో వరి నాట్లు వేశారు. బోర్ మోటార్‌లను నమ్ముకొని వరినాటు భూమి ఉన్న వరకు వేశామని, ఇప్పుడు బోర్లు పని చేయకపోవడంతో చాలా వరకు వరి పంటలు ఎండిపోతున్నాయని, పెట్టుబడి కూడా రాలేని పరిస్థితి ఉందని ఆవేదన చెందారు. దున్ను కాలం నుంచి వరి నాటు వేసి కలుపు కలిసే వరకు దాదాపు రూ.30 వేల పెట్టుబడి అయిందని, వరి పొలం ఎండిపోవడంతో తెచ్చిన బాకీలు కట్టేది ఎట్లా అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. చేతికి వచ్చిన పంటలు ఎండ తీవ్రతకు ఎండిపోతుంటే ఏమి చేయాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. మండలంలో కొన్ని గ్రామాలకు కాళేశ్వరం నీరు కాలువల ద్వారా వస్తున్నాయని, తమ గ్రామాలకు కూడా నీరు వచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. కాళేశ్వరం నీరు కాలువల ద్వారా ప్రతీ గ్రామంలో గల చెరువులలోకి పంపించినట్లయితే భూగర్భ జలలు పెరిగి బోర్లల్లో సమృద్ధిగా నీరు వస్తుందని అభిప్రాయ పడ్డారు.

ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి



రైతు చంద్రయ్య, నందగోకుల గ్రామంలో వర్షాకాలంలో వరి పంటలు పుష్కలంగా పండుతాయని యాసంగి పంటలు మాత్రమే ఇబ్బందికరంగా ఉంటుంది. బోరు మోటార్లను నమ్ముకొని నాటు వేస్తే భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరు మోటర్లు నీరు పోయడం లేదు. పెట్టిన పెట్టుబడి రాక అప్పులకు తెచ్చి పెట్టుబడి పెడితే బాకీలు ఎట్లా కట్టేదో ఏమో అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఎండిన పంటలకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

వైద్యం పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

- నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలి
- సరిపడా మందుల నిల్వలు అందుబాటులో ఉండాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-కొల్చారం

వైద్యం పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహించకూడదని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మండలం రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఓపీ వార్డు, ఐపీ వార్డు, ఏఎన్సీ క్లినిక్‌ను, సందర్శించి, ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలు, రోగుల వివరాల గురించి, వైద్యులు, నర్సులు, సిబ్బంది హాజరును అడిగి తెలుసుకున్నారు. అలాగే రోగులతో మాట్లాడి వారి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలో ఎప్పుడు చేరారు. ఏం అయ్యింది. ఆరోగ్య పరిస్థితి ఇప్పుడు ఎలా ఉంది. కేంద్రంలో అందించే భోజనం ఎలా ఉంది. మందులు సమయానుగుణంగా వేస్తున్నారా. టెస్టులకు వచ్చి ఎంతసేపు అవుతుందని అడిగారు. ఆరోగ్యం చాలా విలువైందని, ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని రోగులకు సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతిరోజూ ఫాగింగ్ చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వైద్యులు, నర్సులు, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌లను, ఓపీ, ఐపీ రిజిస్టర్లను, మందుల నిల్వల రిజిస్టర్‌లను పరిశీలించి, రక్త నమూనాలను అధిక సంఖ్యలో సేకరించి, వాటి రిపోర్టులను సకాలంలో అందించాలని, ఓపీ సేవలను మరింతగా పెంచేందుకు కృషి చేయాలన్నారు. యాంటీబయోటిక్స్, పాము కాటు మందులు, తదితర ఔషధ నిల్వలను సరిపడా అందుబాటులో ఉంచాలని, రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, నర్సులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైద్యులు, నర్సులు, సిబ్బంది, పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా షాపు దగ్ధం

- రెండు లక్షల వరకు ఆస్తి నష్టం.
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ బాధితురాలి ఆవేదన





నవతెలంగాణ-మనోహరాబాద్

ప్రమాదవశాత్తు కిరాణా షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించింది. ఈ సంఘటనతో తన కుటుంబం రోడ్డున పడిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు బండి యాదమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన మనోహరాబాద్ మండలంలోని రామాయపల్లి గ్రామంలో అర్ధరాత్రి జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం రామాయపల్లి గ్రామానికి చెందిన బండి యాదమ్మ గ్రామంలో కిరాణా షాప్‌ను ఏర్పాటు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటుంది. కాగా శుక్రవారం రోజు షాపులో వస్తువులు అయిపోవడంతో మరిన్ని వస్తువులను తీసుకువచ్చి షాపులో ఉంచినట్టు తెలిపారు. రాత్రి వరకు షాప్‌లో ఉండి రాత్రి కావడంతో షాప్‌ను మూసేసి ఇంటికి వెళ్లినట్టు బాధితురాలు యాదమ్మ తెలిపారు. కాగా అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో షాపులో ఉన్న పూర్తి సామాను, ఫ్రిజ్జు, పప్పులు ధాన్యాలు, బియ్యం లాంటి వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. ఉదయం వచ్చి చూడగా మంటలు చెల్లరేగుతుండడంతో నీటిని చల్లి ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే షాప్‌లో ఉన్న సామాను అంతా అగ్నికి ఆహుతైంది. కుటుంబ పోషణకు ఆధారమైన కిరాణా షాపు దగ్ధం కావడంతో బాధితురాలు యాదమ్మ తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కిరాణా షాపు దగ్ధమైన సంఘటనను తెలుసుకున్న మనోహరాబాద్ మాజీ ఎంపీపీ పురం నవనీత రవి ముదిరాజ్ గ్రామానికి చేరుకుని, బాధితులను ఓదార్చి తన వంతు సహాయంగా రూ.5000లను అందజేశారు. అలాగే భవిష్యత్తులో ఎలాంటి సాయం కావాలన్నా చేయగలమని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మర్కంటి బిక్షపతి కుమార్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, భాస్కర్ గౌడ్, ప్రసాద్ గౌడ్, మార్కండే బాబు, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం







నవతెలంగాణ-మనోహరాబాద్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం మనోహరాబాద్ మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ, మహిళా సంఘాల నాయకురాలకు ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ మహిళలు బాగుంటేనే ఆ కుటుంబం, రాష్ట్రం, దేశం బాగుంటుందని తెలిపారు. ఎక్కడ స్త్రీలు పూజించబడుతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని తెలిపారు. సమాజంలో మార్పు తీసుకురావాలంటే మహిళా మూర్తుల పాత్ర అత్యంత కీలకమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని తెలిపారు. మున్సిపల్ కేంద్రంలోని ఏడవ అంగన్వాడీ కేంద్రంలో టీచర్ ఇందిరా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలకు, చిన్నారులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ నర్సాపూర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం నర్సాపూర్ పట్టణంలో బీజేపీ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ హాజరై మహిళలను శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఓబిసి మోర్చా ఉపాధ్యక్షులు చిన్న రమేష్ గౌడ్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్ద రమేష్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరాజ్, ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గుండం శంకర్, పట్టణ ఉపాధ్యక్షులు రాజు, నాయకులు సదానంద చారి, బీజేవైఎం నాయకులు అరవింద్ గౌడ్ తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ- టేక్మాల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని టేక్మాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహంలో శనివారం మహిళా దినోత్సవం వేడుకలు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్లాదుర్గ్ సిఐ రేణుక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా దినోత్సవం సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలని, విద్యార్థినులు ఇష్టంతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చాలా గొప్ప పనిచేశారని, భారత రాజ్యాంగంలో మహిళలకు సమాన హక్కులు కల్పించారన్నారు. మహిళలందరూ పురుషులతో పోటీ పడుతూ అన్నిరంగాలలో ముందుకు సాగాలని సిఐ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు యాదయ్య, ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు ఆనంద్ కుమార్, నవతెలంగాణ విలేకరి కంది భాగయ్య, కృష్ణ, నాయికోటి వెంకటేష్, అశోక్, రాములు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా టీచర్లకు సెలవు ఇవ్వకపోవడం సిగ్గుచేటు

- క్యాజువల్ లీవ్ ఇవ్వరా ...తపస్

నవతెలంగాణ-చేగుంట

మహిళా దినోత్సవం రోజు మహిళా టీచర్లకు సెలవు ఇవ్వకపోవడం సిగ్గుచేటని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పేర్కొన్నారు. చేగుంటలో విలేకరులతో మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్పెషల్ క్యాజువల్ సెలువు ఇవ్వకపోవడం బాధాకరమని వారన్నారు. మహిళా దినోత్సవం రోజుకూడా విధులు నిర్వహించాలని ఆదేశించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకులాల పాఠశాలల సమయపాలన కూడా ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా ఉండాలని, మహిళలకు నైట్ కేర్ టేకర్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా బాధ్యులు మాధవరెడ్డి, శ్రీధర్ రెడ్డి, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయము

నవతెలంగాణ-టేక్మాల్

మండల పరిధిలోని కాదులూరు 33 (కేవి) లైన్ వర్క్ కారణంగా కాద్లురీర్ సబ్ స్టేషన్‌కు రావలసిన 33 కెవి లైన్‌లో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. దీంతో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు కాద్లురీర్ 33,11 (కేవి) సబ్స్టేషన్ పరిధిలో గల కాద్లురీర్, బొడ్మాట్ పల్లి, బర్డిపూర్ గ్రామాలకు సింగల్ ఫేస్ సప్లై మాత్రమే ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ గ్రామాల పరిధిలోగల రైతు వినియోగదారులు సహకరించాలని ఏడిఈ జి.శ్రీనివాస్, ఏఈ ఉదయ భాస్కర్‌లు కోరారు.

పిల్లుట్లలో పబ్బ మహేష్ గుప్త ఆర్థిక సహాయం



నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన ఉపాధి హామీ పీల్డ్ అసిస్టెంట్ జోగు రాములు ఇటీవలే మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించి, వారికి రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అదేవిధంగా అనారోగ్యంతో మరణించిన రెడ్డిపల్లి రామమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఇటీవలే మరణించిన సంద్ర హంసమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన నర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నాయిని దామోదర్ రెడ్డి, చింత స్వామి, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు లక్ష్మీ నర్సయ్య, పీల్డ్ అసిస్టెంట్లు దేవేందర్, సంజీవచారి, గ్రామ కమిటీ మాజీ అధ్యక్షులు బబ్బురి వెంకటేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


దేవాలయ నిర్మాణానికి విరాళం

పెద్దగొట్టిముక్కుల గ్రామంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న శ్రీపెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి తనవంతు సహాయంగా రూ. 1,11, 116 ల విరాళాన్ని అందజేయనున్నట్లు మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త నిర్వాహకులకు శనివారం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దగొట్టిముక్కుల నాయకులు, ఆలయ నిర్మాణ నిర్వాహకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆటపాటలు ఎంతో ముఖ్యం

- సాధించిన విజయం రేపటికి నాంది కావాలి
- డాన్ బాస్కో పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే సునీత రెడ్డి
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

నవతెలంగాణ-నర్సాపూర్




విద్యార్థులకు చదువులతోపాటు ఆట పాటలు ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం నర్సాపూర్ పట్టణంలోని డాన్ బాస్కో పాఠశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే సునీత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు టెక్నాలజీ ఎంతో ముఖ్యమని, అధిక టెక్నాలజీని ఉపయోగించుకోకుండా తమకు అవసరమైన టెక్నాలజీని మాత్రమే నేర్చుకోవాలన్నారు. విద్యార్థుల చదువు బాధ్యత కేవలం ఉపాధ్యాయులదే కాదని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుల పట్ల బాధ్యత తీసుకోవాలన్నారు. అదేవిధంగా పాఠశాలలో బాగా చదివే విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు డీజే పాటల మధ్య నిర్వహించిన డ్యాన్సులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ నాహీముద్దీన్, డాన్ బాస్కో పాఠశాల చైర్మన్ యస్వంత్ రెడ్డి, డైరెక్టర్ నర్సిరెడ్డి, ప్రిన్సిపాల్ మేఘన, నాయకులు పంబల బిక్షపతి, రామ్ చందర్, జ్ఞానేశ్వర్, రాకేష్ గౌడ్ తదితరు పాల్గొన్నారు.



14 శాతం ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించాలి

- కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్



ఎల్ఆర్ఎస్ కు ధరఖాస్తు చేసుకున్నవారు రిజిస్ట్రేషన్ దస్తావేజుల ల్యాండ్ వ్యాల్యూ ప్రకారం 14% ఎల్ఆర్ఎస్ చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి తెలిపారు. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు మార్చి 31 చివరి తేది అని తెలిపారు. ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా ఆస్తి పన్నుతో పాటు నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్సు ఫీజులు చెల్లించి పురపాలక పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే, పూర్తి వివరాలకు వార్డు అధికారిని సంప్రదించాలని కమీషనర్ గణేష్ రెడ్డి తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు గ్రామానికి చెందిన కోల నర్సింలు గౌడ్ - మహేశ్వరి దంపతుల కుమార్తె వివాహ పత్రికలు పంచేందుకు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మహేశ్వరి మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం తన బాల్య మిత్రులు లక్కపల్లి నర్సింలు, అప్పిసు నర్సింలు, దేవులపల్లి భూమయ్య, బాల్ రాజ్,రాగీరు రవీందర్, మల్లేశంలు కలసి రూ.14 వేల ఆర్థిక సాయం అందచేసి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

శ్రీవాణి స్కూల్లో ఘనంగా మహిళ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని భారత్ నగర్‌లో గల శ్రీవాణి పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సత్యం మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉద్దేశం ముఖ్యంగా లింగ సమానత్వం, మగవారితో సమానంగా ఎలాంటి పక్షపాతం లేకుండా వేతనాలను ఇవ్వడం, పనులు చేయడం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు వివిధ అంశాలపై ఉపన్యసించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి, మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వారికి మెమొంటో అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరపల్లిలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని వెంకటేశ్వరపల్లిలో రూ. 10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను శనివారం బిజెపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఖమ్మం వెంకటేశం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కేంద్రహోం శాఖ సహాయమంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఈజీఎస్ స్పెషల్ గ్రాంట్ నిధుల నుంచి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామాలలో మెరుగైన రోడ్డు వసతి అవసరమని గుర్తించి మంజూరి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శెట్టి సుధాకర్, తోట ఆంజనేయులు, మాజీ వార్డు మెంబర్ కంది శ్రీనివాస్‌రెడ్డి, బిజెవైఎం మండల అధ్యక్షుడు కంది సత్యనారాయణరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు భీంరెడ్డి లక్ష్మారెడ్డి, గ్రామస్థులు షేక్ హెూలీ, తూటి రాజిరెడ్డి, గుజ్జ శ్రీనివాస్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, సంజీవరెడ్డి, దానబోయిన శరత్, పండుగ సంజీవ్, దానబోయిన సురేష్, గౌరవేని వెంకటయ్య, పిన్‌రెడ్డి రాజిరెడ్డి, వాసాల రాజయ్య, తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్సీ కవితను కలిసిన రాజేశ్వరరావు



నవతెలంగాణ-మర్కుక్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా. బీఆర్ఎస్ నాయకులు, గ్రీన్ ఇండియా చాలెంజ్ గజ్వేల్ కో-ఆర్డినేటర్ చెప్యాల రాజేశ్వర్ రావు (రాజు) దంపతులు శనివారం మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాజేశ్వర్ రావు, ఆయన సతీమణి మేఘనారాణిలు మహిళలందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

పేదింటి ఆడబిడ్డలకు దేవన్న కళ్యాణ కానుక



నవతెలంగాణ-దుబ్బాక

పేద కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లిళ్లకు తనవంతుగా ఆర్థిక చేయూతను అందించడం జరుగుతుందని అచ్చుమాయిపల్లి మాజీ ఉప సర్పంచ్ పర్స దేవరాజ్ ముదిరాజ్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు నుంచే శ్రీకారం చుట్టామన్నారు. శనివారం దుబ్బాక మండల పరిధిలోని అచ్చుమాయిపల్లి మధిర గ్రామం పర్శరాంనగర్‌లో పర్స భాగ్యమ్మ -రాజు దంపతుల కుమార్తె ఆకాంక్ష పెళ్లి సందర్భంగా "దేవన్నా కళ్యాణ కానుక" పేరిట రూ.5 వేల ఆర్థిక చేయూతను అందజేశారు. ఆయన వెంట పలువురు గ్రామస్తులున్నారు.

అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-గజ్వేల్

మండలం కోడకండ్ల గ్రామంలో అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఓటింగ్ పద్ధతి ద్వారా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా ప్రవీణ్ కుమార్, వంశి తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహనీయులు కలలుగన్న సమ సమాజ స్థాపన కోసం తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు. మహనీయుల ఆలోచనలను, ఆశలను బహుజన ప్రజలలోకి తీసుకెళ్తామన్నారు. అంబేద్కర్ సంఘం పార్టీలకు, కులాలకు, మతాలకతీతంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు చంద ప్రవీణ్ కుమార్, తాజా మాజీ ఎంపీటీసీ అరిగే అశోక్ కుమార్, మాజీ సర్పంచ్ ఎడ్ల భూమయ్య, ముంద్రాతి రాజు, కొడిత్యాల భాస్కర్, ఎడ్ల రవి, గజ్వేల్ శైలేష్, ముంద్రాతి కృష్ణ, కనకయ్య, నాగరాజు, రవికుమార్, ప్రవీణ్, గిరిబాబు, గణేష్, ముఖేష్, శివప్రసాద్, బాలచందర్, రవికుమార్, నరేష్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీహరికోట క్షేత్ర పర్యటన చేసిన విద్యార్థులు



నవతెలంగాణ-సిద్దిపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు, బోధనా సిబ్బంది క్షేత్ర పర్యటనలో భాగంగా పూర్వ విద్యార్థి డాక్టర్ వి.సురేందర్ ఆహ్వానం మేరకు సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం, షార్ (శ్రీహరికోట) కేంద్రాన్ని సందర్శించారు. రాకెట్ ప్రయోగ కార్యకలాపాలు, ఈ లాంచ్ ప్యాడ్‌లను, దానికి సంబంధించిన టెక్నాలజీని, రాకెట్ల ప్రయోగానికి పలు దశల టెక్నాలజీల గురించి విద్యార్థులు, బోధన సిబ్బంది తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ సిహెచ్ మధుసూదన్, అధ్యాపకులు డాక్టర్ భాస్కర్, సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ మహేష్ కుమార్, డాక్టర్ మనోహర్, డాక్టర్ బైరయ్య, డాక్టర్ లీలావతి, డాక్టర్ రాణి, వెంకటరమణ, కృష్ణయ్య డాక్టర్ పునియమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నతల్లిని బండరాయితో కొట్టి చంపిన నిందితుల అరెస్ట్



- తొగుట సీఐ షేక్ లతీఫ్

నవతెలంగాణ-దౌల్తాబాద్

కన్నతల్లిని బండరాయితో కొట్టి చంపిన కేసులో ముగ్గురు నిందితు లను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కి పంపడం జరిగిందని తొగుట సిఐ షేక్ లతీఫ్ అన్నారు. శనివారం దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చ్ 06వ తేది ఉదయం 10:00 గంటలకు నిందితులు ముగ్గురు కలిసి కొన్ని రోజుల నుంచి కుటుంబంలో జరుగుతున్న గొడవల విషయంలో మెదక్ జిల్లా శంకరంపేట మండలం కోర్విపెల్లి గ్రామానికి చెందిన సింగమొల్ల లక్ష్మీ (49)ను చంపాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారమే గురువారం ఉదయం 10:00 గంటలకు లక్ష్మీ (49) తలపై బండరాయితో కొట్టగా బలమైన గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం 6:00 గంటలకు లక్ష్మీ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు విచారణ చేపట్టగా నిందితులు ముగ్గురు కలసి లక్ష్మిని బండరాయితో కొట్టి హత్య చేసినట్లు అంగీకరించారు. ముగ్గురు నిందితులు నేరం ఒప్పుకున్నందున, నేరస్తులు నేరం చేయడానికి ఉపయోగించిన బండరాయి, మోటార్ సైకిల్ రెండు సెల్ ఫోన్లు, స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ముగ్గురి నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించడం జరిగిందని తొగుట సిఐ లతీఫ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ భద్రత

- పయనీర్ సీడ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం
- పాల్గొన్న ఎస్సై అపూర్వ రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ శిరీష



నవతెలంగాణ-సిద్ధిపేట రూరల్

మహిళలల ఆరోగ్యంతోనే కుటుంబం భద్రంగా ఉంటుందని ఎస్ఐ అపూర్వ రెడ్డి గైనకాలజిస్ట్ డాక్టర్ శిరీష అన్నారు. శనివారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామంలో పయనీర్ సీడ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లోహిత్ సాయి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ భాస్కర్ అమిరి శెట్టి ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ శిరీష మహిళల ఆరోగ్య సమస్యలు గురించి వివరించారు. అనంతరం ఎస్సై అపూర్వ రెడ్డి మాట్లాడుతూ మహిళలు తక్కువనే ఆలోచన లేకుండా అన్నింటిలో నేను సమానం అన్నీ చేయగలనని ముందుకు వెళ్లాలని అప్పుడే మన కలలు నిజమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పరమేశ్వరి, డాక్టర్ శ్వేత, పంచాయతీ కార్యదర్శి సునైన రాణి ,అంగన్వాడి టీచర్ కవిత, సి ఏ బాలమణి, హాస్పిటల్ మేనేజర్ చంద్రశేఖర్, పైనీర్ సీడ్స్ కంపెనీ ప్రతినిధి అశోక్ రెడ్డి , ఎం డి ఆర్ మద్దూరి నరేష్ మహిళలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారమయ్యాయి. 229 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు,13 ఒప్పుకున్న కేసులు, 26 బ్యాంకు కేసులు, రెండు సైబర్ నేరాలు, 8 రాజీ పడిన కేసులు, మొత్తం 274 కేసులు, బ్యాంకుకు సంబంధించిన కేసులలో 18 లక్షల కు గాను వన్ టైం సెటిల్మెంట్ రూ.6.20 లక్షలకు అయినట్టు చేర్యాల కోర్టు ఇంచార్జి జడ్జి ఏ.కృష్ణ తేజ్ తెలిపారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన 22 మందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున ఫైన్, తాగి టూ వీలర్ నడిపిన 11 మందికి రూ.2000 ల చొప్పున, ఒక వ్యక్తికి రూ.2500లు, తాగి ఫోర్ వీలర్ నడిపిన ఒక వ్యక్తికి పదివేల రూపాయల ఫైన్ వేసినట్లు జడ్జి తెలిపారు.

సమాన పనికి సమాన వేతన చట్టం అమలు చేయాలి

- పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలి
- కార్మిక వ్యతిరేక కోడ్‌లు రద్దు చేయాలి
- అంబేద్కర్ చౌరస్తాలో ప్లే కార్డులతో ప్రదర్శన
- సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రామిక అంతర్జాతీయ మహిళ దినోత్సవం
- సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



నవతెలంగాణ- గజ్వేల్

మహిళలందరికీ సమాన పనికి సమాన వేతన చట్టం అమలు చేయాలని, కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా గజ్వేల్ పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో ప్లే కార్డులతో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు మొదట ఓటు హక్కు కోసం, పని గంటలు తగ్గించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని లింగ వివక్షను పోరాటం నిర్వహించారని తెలిపారు. జర్మన్ సోషలిస్టు నాయకురాలు క్లారా జెట్కిన్ ఆధ్వర్యంలో 1910 లో డెన్మార్క్ లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు మహిళా మహాసభల్లో ప్రపంచవ్యాప్తంగా మహిళా దినోత్సవాలు జరపాలని నిర్ణయించడం జరిగిందన్నారు. 1921 రష్యాలో జరిగిన కమ్యూనిస్టు మహిళా మహాసభల్లో మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరపాలని తీర్మానించడం జరిగిందన్నారు. మహిళా దినోత్సవం అంటే ఒకరోజు గౌరవించడం కాదని, కుటుంబంలో వివక్ష లేకుండా పెంచడం, సమానత్వ అవకాశాలు కల్పించడం, మహిళల సామాజిక అంచివేతకు వ్యతిరేకంగా పోరాటమన్నారు. మహిళలకు పని గంటలు తగ్గించాలని, ఆరోగ్య సమస్యలు, ప్రసూతి సెలవులు, సమాన వేతనాలు ఇవ్వాలని పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న చట్టాలను రద్దుచేసి కార్మిక సంక్షేమ పథకాలు యజమానులకు అనుకూలంగా మారుస్తుందన్నారు. మహిళలను సరుకుగా చూసే సంస్కృతి రోజు రోజు పెరుగుతుందని దీనిని నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మరాఠీ కృష్ణమూర్తి, ఆర్‌పి సంఘం జిల్లా కార్యదర్శి సుభద్ర, కల్పన, మనోహరి, సుధారాణి,ఫాతిమా, సంధ్యారాణి, పావని, మసూద్ ఉన్నిసా, వర కుమారి, భవాని, కృష్ణ లీల, బాలమణి, జ్యోతి రజిని రాణి తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ వెంకటేశం ఆశయ సాధన కోసం యువత ఉద్యమించాలి

- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

కార్మిక వర్గ దృక్పథం కలిగిన కామ్రేడ్ రాళ్లబండి వెంకటేశం ఆశయ సాధన కోసం ఉద్యమించాలని సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి యువతకు పిలుపునిచ్చారు. కామ్రేడ్ వెంకటేశం 10 వర్ధంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలలోని అన్ని గ్రామాలలో సిఐటియు జెండా ఎగరవేయడానికి అన్ని గ్రామాలలో హమాలి రంగ కార్మికులను ఏకతాటిపైకి తీసుకువచ్చి కార్మికుల సంక్షేమం కోసం పాటుపడిన వ్యక్తి రాళ్ల బండి వెంకటేశం అని అన్నారు. వెంకటేశం స్ఫూర్తితో నేడు సిఐటియు సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. హమాలి రంగ కార్మికుల రేట్ల విషయంలో యాజమాన్యంతో కొట్లాడి రేట్లు పెంచిన ఘనత వెంకటేశంకే దక్కుతుందని, ఆయన లేని లోటు కార్మిక వర్గానికే కాకుండా పార్టీకి తీరని లోటన్నారు. వెంకటేశం కుటుంబం అంతా తాను చూపిన మార్గంలోనే ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని అధిగమిస్తూనే నిక్కచ్చిగా పార్టీ కోసం పని చేస్తుందని తెలిపారు. నేటి యువత కూడా బూర్జువా పార్టీల కోసం కాకుండా నిక్కచ్చిగా ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే సీపీఐ(ఎం) వైపు నిలబడాలని, అప్పుడు మాత్రమే గ్రామాలలో ప్రజా సమస్యల పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, వెంకటేశం తనయులు పార్టీ పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, శాఖా కార్యదర్శి రాళ్ల బండి భాస్కర్, నాయకులు రాళ్ల బడి చందు, మండల కార్యదర్శి బండ కింది అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు పోలోజు శ్రీహరి, శాఖా కార్యదర్శులు ఇప్పకాయల శోభ, బోయిని మల్లేశం, ముస్త్యాల ప్రభాకర్,మేర్గోజు సత్యనారాయణ, ఎర్రబోసు అశోక్, మంచాల నారాయణ గుప్త, బొంగోని భాస్కర్, దొనకాల కనక లక్ష్మి, కే. కనకమ్మ, ఎండి.నూర్బీ, కొంగరి శ్రీధర్,మేర్గోజు ప్రవీణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు హక్కుల కోసం ఉద్యమించాలి

- ప్రముఖ మహిళా న్యాయవాది టీ.రేణుక.
- ఐద్వా సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సభ



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

మహిళలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని సిద్దిపేట ప్రముఖ మహిళా న్యాయవాది టీ. రేణుక అన్నారు. శనివారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేటలోని కార్మిక కర్షక భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సభ ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన న్యాయవాది రేణుక మాట్లాడుతూ మహిళలు సమాజంలో సగభాగం అని, అన్ని రంగాలలో మహిళలు కీలక పాత్ర పోషిస్తూ అనేక విజయాలు సాధిస్తున్నారన్నారు. అనేక ఉద్యమాలు పోరాటాలలో మహిళల పాత్ర లేకుండా ఏవి విజయం సాధించలేదన్నారు. కానీ సమాజంలో మహిళలపై రోజురోజుకు దాడులు దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. వరకట్న వేధింపులు వివక్షతకు గురవుతున్నారన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు నోచుకోకుండా పాలకులు మహిళల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. చట్టాలలో మహిళలకు అనేకమైన హక్కులు కల్పించబడ్డాయని వాటిని సద్వినియోగం చేసుకొని మహిళల పట్ల జరుగుతున్న ఘటనలను పరిష్కరించుకోవాలని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన మహిళా చట్టాలను నేటి పాలకులు అమలు చేయడం లేదని చట్టాల్లో అనేక మార్పులు తీసుకొస్తూ మహిళల హక్కులను హరించి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, ఐద్వా జిల్లా కార్యదర్శి అత్తిని శారద, ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు బత్తుల అభినవ్ మహిళ సంగం జిల్లా నాయకులు బోడిగం వరలక్ష్మి, బద్దిపడిగా విగ్నేశ్వరి, బండోజు హేమలత, దండు లక్ష్మి, ఎండి. నూర్ బి, నరెడ్ల నరసవ్వ మంద శోభ ప్రమీల రాజేశ్వరి, కనకవ్వ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌ను సర్వ నాశనం చేసిన హరీష్ రావు

- మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గాన్ని మాజీ మంత్రి హరీష్ రావు సర్వనాశనం చేసినట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ లు ఆరోపించారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎంగా ఉండి కేసీఆర్ గజ్వేల్‌కు ఏమి చేయలేక పోయారన్నారు. 100 మీటర్ల రింగ్ రోడ్డు 500 మీటర్ల కోట మైసమ్మ రోడ్డు ఎందుకు పూర్తి చేయలేదని వారు ప్రశ్నించారు. అంతే కాకుండా పది సంవత్సరాలు అధికారంలో ఉండి పేదలకు రూ.1250లు ఎందుకు ఇవ్వలేదని ఇప్పుడు ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రతాప్ రెడ్డి డ్రామాలు మానుకోవాలని వారు హెచ్చరించారు. మల్లన్న సాగర్ నిర్మాణం పేరిట ఏడు గ్రామాల ప్రజలను కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, వారి తాబేదార్ ప్రతాప్ రెడ్డిలు నిలువునా మోసం చేసి, నిబంధనలకు విరుద్ధంగా వారి అనుచరులకు వందల కొద్ది ప్లాట్లు, రూ కోట్ల నగదు దోచిపెట్టినట్లు ఆరోపించారు. మీ అండతోనే అనుచరులు అవినీతి, అక్రమాలకు పాల్పడగా, నిలదీసిన పలువురిని హత్య చేసేందుకు సైతం కుట్రలు పన్నిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అంతేకాకుండా గజ్వేల్ ఇందిరా పార్క్ నుండి కోట మైసమ్మ వరకు రోడ్డు విస్తరణలోని బాధితులను ఆదుకుంటామని హామీ ఇవ్వగా, అధికారం కోల్పోయాక కల్లబొల్లి మాటలతో బాధిత కుటుంబాలను రెచ్చగొట్టడం సిగ్గుచేటన్నారు. పదేళ్లపాటు కేసీఆర్ హరీష్ రావులతో అంటకాగిన ప్రతాపరెడ్డి ప్రస్తుతం ఆ నెపాన్ని కాంగ్రెస్‌పై నెట్టడం ఆయన నీతిమాలిన రాజకీయాలకు అద్దం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుఖేందర్ రెడ్డి, నరసింహారెడ్డి, ఏఎంసి డైరెక్టర్లు కరుణాకర్ రెడ్డి యాదయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాముడు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్ నాయకులు కుట్ల లక్ష్మారెడ్డి, అంజి యాదవ్, జహీర్, జహగిర్, డప్పు గణేష్, బలగౌడ్, యాదగిరి, శ్రవణ్, అరుణ్, ఆర్ అండ్ ఆర్ కాలనీ నాయకులు ఉపేందర్ ప్రమోద్ పిట్ల శ్రీను, రాములు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

- బహుమతులు అందించిన మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణ 19వ వార్డులోని అరుంధతి కల్యాణ మండపంలో జువ్వన్న ప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు, స్థానిక వార్డు కౌన్సిలర్ గ్యాదరి రవిలు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, బాగా చదువుకొని అనుకున్న లక్ష్యానికి చేరుకోవాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫుడ్ ఫెస్టివల్...

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గణేష్ నగర్ స్ప్రైస్ స్కూల్‌లో విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కడవేరుగు మంజుల రాజనర్సు మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు మహిళలు అన్ని రంగాలలో ఎంతగానో అభివృద్ధి చెందుతున్నారని, అతివలు ఎందులో తక్కువ కాదంటూ తమ ప్రతిభను కనబరుస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మహిళ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కాటం శోభారాణి రఘురాం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, ఉపాధ్యాయులు రవి, స్థానిక నాయకులు సాయన్న గారి లిఖిత్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.35 కోట్లు మింగిన వంటేరు ప్రతాప్ రెడ్డి

- నిర్వాసితుల ఆరోపణ



నవతెలంగాణ- గజ్వేల్

మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఆస్తులు, సామాగ్రి తరలించేందుకు అప్పటి ప్రభుత్వం రూ38 కోట్లు ఇచ్చినట్లు వాటిని బీఆర్ఎస్ నాయకులు వంటేరు ప్రతాప్ రెడ్డి మింగినట్లు నిర్వాసితులు మార్కెట్ డైరెక్టర్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌లు ఆరోపించారు. శనివారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్ రావు అండదండలతో నిర్వాసితుల డబ్బులను కాజేసినట్లు వారు ఆరోపించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ50 వేలు ఇచ్చినట్లు ఇటీవల మాజీ మంత్రి హరీష్ రావు మల్లన్న సాగర్ కాలనీకి వచ్చిన సందర్భంగా ప్రకటించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. వాటిని ప్రతాప్ రెడ్డి ద్వారా అందించామని ప్రకటించినట్లు, ఆ డబ్బులు ఎవరికి ఇచ్చినట్లు వారు ప్రశ్నించారు. అంతేకాకుండా మల్లన్న సాగర్ కాలనీలో బినామీ పేర్లతో జాబితాను తయారు చేసి హరీష్ రావు, ప్రతాప్ రెడ్డిలు కబ్జా చేసినట్టు వారు ఆరోపించారు. ఆ బాగోతాన్ని త్వరలోనే బయట పెడతామన్నారు. నిర్వాసితులకు గత పది సంవత్సరాల్లో సీఎంగా ఉన్న కేసీఆర్ ఎందుకు పట్టించుకో లేదని వారు పేర్కొన్నారు. గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా, రాస్తారోకో చేయడం కాదని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వద్ద ధర్నా చేస్తే నిర్వాసితులకు పరిహారం వస్తాయన్నారు. లక్ష్మాపూర్ గ్రామంలో ఒక్కొక్కరికి రెండు మూడు ప్లాట్లు, రెండు మూడు ఇండ్లు ఇచ్చారని వారు ఆరోపించారు. దీని వెనుక హరీష్ రావు మద్దతుతో వంటేరు ప్రతాప్ రెడ్డి కుట్ర ఉందని వారు చెప్పారు. మల్లన్న సాగర్‌లో స్మశాన వాటిక లేదని, బడి గుడి లేదన్నారు. ఒక గ్రామాన్ని తరలించినప్పుడు మౌలిక సదుపాయాలు లేకుండా ఎలా గ్రామాలు నిర్మించినట్లు వారు ప్రశ్నించారు. ఉగాది, రంజాన్ పండుగ తర్వాత ప్రతాప్ రెడ్డిని రోడ్డుపై లాగుతామని నిర్వాసితులు తెలిపారు. అధికారంలో ఉండి పని చేయలేక ఇప్పుడు కాంగ్రెస్‌పై దుమ్మెత్తి పోయడం ఎందుకని కేసీఆర్‌కు చేతగాక వ్యవసాయ క్షేత్రంలో కాలం గడుపుతున్నారని వారన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ద్వారా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయినట్లు వారు తెలిపారు. త్వరలోనే మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఒకవేళ డబ్బులు ఎవరికి ఇచ్చారో ప్రతాప్ రెడ్డి వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. లక్ష్మాపూర్ గ్రామంలో ఇండ్ల పంపిణీ, ప్లాట్ల పంపిణీలో అక్రమాలు జరిగినట్లు తాము చెప్పితే తమ కుటుంబాన్ని అంతం చేయడానికి సుఫారి ఇచ్చినట్లు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఆరోపించారు. కేసీఆర్‌కు దమ్ముంటే వ్యవసాయ క్షేత్రం నుంచి బయటకు రావాలని వారు డిమాండ్ చేశారు.

కోర్టు దిక్కారణకు పాల్పడిన దేవరాజ్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-సిద్ధిపేట

హై కోర్టు ఆర్డర్‌ని దిక్కరించిన సిద్దిపేట పురపాలిక టౌన్ ప్లాన్ అధికారి దేవరాజుపై చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ ఫర్ సిటీజెన్ రైట్స్ సంస్థ రాష్ట్ర కార్యదర్శి గుండ్ల శివ చంద్రం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల వై జంక్షన్ వద్ద అక్రమంగా నిర్మిస్తున్న నిరాణంపై హై కోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి దేవరాజ్ పెడచెవిన పెట్టారని ఆరోపించారు. ఎన్నిసార్లు ఆయనకు మాట్లాడుదాం అని ఫోన్ చేసినా కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదని మండిపడ్డారు. సిద్దిపేట మున్సిపల్‌లో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. కోర్టు ఆర్డర్ దిక్కారణే కాకుండా సీసీఆర్ సంస్థ నుంచి పదుల సంఖ్యలో ఆర్‌టిఐ చట్టం ద్వారా రికార్డు వెరిఫికేషన్ కొరకు దరఖాస్తూ చేస్తే ఇప్పటివరకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. అసలు సహ చట్టం అమలు ఉందా అన్న అనుమానం వస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని సిద్దిపేటలో అక్రమ నిర్మాణాలను ఆపాలని, ఆర్‌టిఐ దరఖాస్తులకు అనుమతి ఇవాళన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీసీఆర్ సభ్యులు తుమ్మ రాజు, గుండు రవితేజ, గణేష్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి ఆలయాన్ని దర్శించుకున్న దారం గురువారెడ్డి

- ప్రజ్ఞాపూర్‌లో ఆధ్యాత్మిక వైభవం
- త్రిశక్తి ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

అమ్మ దయ ఉంటే అంత మంచి జరుగుతుందని బీజేపీ సీనియర్ నాయకుడు దారం గురువారెడ్డి అన్నారు, ప్రజ్ఞాపూర్‌లోని త్రిశక్తి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారెడ్డికి చిరు సన్మానం చేసి జ్ఞాపిక అందజేశారు. అనంతరం దారం గురువారెడ్డి మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శ్రీ మహంకాళి మాత, శ్రీ పెద్దమ్మతల్లి, శ్రీ నల్ల పోచమ్మ తల్లి దేవతమూర్తుల ఆలయ నిర్మాణం, దేవతామూర్తుల ప్రతిష్ట మహెూత్సవం కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. అమ్మవారి కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున శక్తి స్వరూపిణి అమ్మవార్లను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధ్యక్షులు రొట్టెల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కదుల్ల దేవేందర్, ప్రధాన కార్యదర్శి కదుల్ల ఎల్లేషం, క్యాషియర్ శ్రీరాం కృష్ణ, బెదరమైన మల్లేశం, మాజీ ఎంపీటీసీ పూదరి రాజలింగం, ఎల్ల మల్లేశం, ఎల్ల శ్రీనివాస్, ఎల్ల ఎంకటేష్, నాయకులు కుడిక్యాల రాములు, రామరాజు, నాగేందర్ రెడ్డి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అహల్య భాయి జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-గజ్వేల్

మహిళా డిగ్రీ కళాశాల గజ్వేల్‌లో, వీరమాత అహల్యబాయి శతజయంతి ఉత్సవాలను, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం అధ్యక్షత వహించి ప్రారంభ ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలు విద్య నేర్చుకోవడం వల్ల సమాజంలో వ్యవస్థలో మార్పు వస్తుందని స్త్రీ పురుషులు సమానత్వంగా ఉండడానికి ఉపయోగపడుతున్నదన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ సుమిత్ర రాయి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే, రమాబాయి లాంటి వారి కృషి ఫలితంగా స్త్రీలకు విద్యను నేర్చుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. మరో విశిష్ట అతిథి డాక్టర్ మమతా రఘువీర్ తరుణి మాట్లాడుతూ కార్యేషు దాసి కరణేషు మంత్రి బోజేషు మాత శయనేషు రంభ అనే స్త్రీ పాత్రను గొప్పగా వర్ణిస్తూ ప్రస్తుత సమాజంలో కొనసాగుతున్న అత్యాచారాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. డాక్టర్ సాయి బాల మాట్లాడుతూ మనువు చెప్పినట్లు ఎక్కడైతే స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు పూజింపబడతారన్నారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ లోకమాత అహల్యాబాయ్, రాణి రుద్రమాదేవి, ఝాన్సీ లక్ష్మీబాయిలాంటి వీర వనితలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాన్నారు. ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సి.పి.డి.సి మెంబర్స్ శ్రీ లక్ష్మణ్, డాక్టర్ నరేష్ బాబు, పరమేశ్వర చారి, డాక్టర్ శ్రీధర్, వైస్ ప్రిన్స్ పాల్స్ కమల క్రిస్టియాన, శ్రీలత, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ ఎంఎం లక్ష్మి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్.పి.జయరాజ్, కస్తూరిబాయి, డాక్టర్ శోభారాణి, డాక్టర్ జె.ఉమారాణి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సరోజ, డాక్టర్ సునీత, రమేష్, శ్రీధర్, శ్యామ్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 5
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
ఆదివారం | 09 మార్చి 2025 | www.navatelangana.com

డప్పు చప్పుళ్లతో ఎస్సీ వర్గీకరణ ఆకాంక్ష

నవతెలంగాణ-నంగునూరు



ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం శనివారం మండల కేంద్రంలో జగ్జీవన్ రామ్ చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణ ఆకాంక్షను డప్పు చప్పుళ్లతో తెలియజేశారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, ఎంఎస్పీ మండల అధ్యక్షులు దేవులపల్లి బాలరాజు, సిద్దిపేట ఎంఎస్పీ నియోజకవర్గం ఇన్చార్జి కంది కట్ల రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కులం పెద్దలు పెర్మని యాదయ్య, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పాపి గారి నరేశ్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దేవులపల్లి నర్సింగరావు, రాజమౌళి, దేవులపల్లి పెద్ద భూమయ్య, దేవులపల్లి కనకయ్య, కొమ్మన్న గారి బాలరాజు, రామచంద్రం, బంగారి నర్సింలు, కనకరాజు, బాల్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన హరికృష్ణ

నవతెలంగాణ-సిద్ధిపేట



ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ విశ్వనాథన్‌ను హైదారాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విశ్వనాథన్ సూచించినట్లు తెలిపారు. సిద్ధిపేట నియోజకవర్గంలోని మండల కేంద్రాలు, గ్రామాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేశారన్నారు. సిద్ధిపేటలో కాంగ్రెస్ పార్టీ మరింతగా పనిచేయాలంటే నామినేటెడ్ పదవులు త్వరలోనే పూర్తి చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

క్రాంతి హైస్కూల్లో విజ్ఞాన ప్రదర్శన

నవతెలంగాణ-సిద్ధిపేట



పట్టణంలోని క్రాంతి హై స్కూల్లో శనివారం నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన విద్యార్థుల శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించడంలో గొప్ప విజయాన్ని సాధించింది. విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు, ప్రాజెక్టులు ఆశ్చర్యపరిచాయి. ఛైర్మన్ అర్పిత రెడ్డి, కరస్పాండెంట్ భగవాన్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసి, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆసక్తిని పెంచుతాయన్నారు. తమ పాఠశాల ఎల్లప్పుడూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమారస్వామి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ.. భవన నిర్మాణ కార్మికుడు మృతి

నవతెలంగాణ-దుబ్బాక



చింతకాయలు తెంపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి కిందపడిన భవన నిర్మాణ కార్మికుడికి తీవ్ర గాయాలు కాగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం దుబ్బాక పట్టణ కేంద్రానికి చెందిన ఎంగారి రాజిరెడ్డి (52) వ్యవసాయంతో పాటు భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ.. భార్యపిల్లలతో జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 3న తన వ్యవసాయ పొలంలోని చింత చెట్టు ఎక్కి కాయలను కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడటంతో తలకు, వెన్నుపూసకు తీవ్ర గాయాలయ్యాయి. రాజిరెడ్డిని చికిత్స కొరకు దుబ్బాక ప్రభుత్వాసుపత్రికి, సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాకలోని ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని.. చిరు వ్యాపారి మృతి

నవతెలంగాణ-దుబ్బాక



గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో చిరు వ్యాపారికి తీవ్ర గాయాలు కాగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కేదారి ముత్తయ్య (75) బట్టలు అమ్ముతూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం బట్టలు ఖరీదు చేసేందుకు దుబ్బాకకు వచ్చి కొత్తపల్లికి తిరిగి వెళుతుండగా దుబ్బాక మండల పరిధిలోని పోతారం శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ముత్తయ్య తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్స్ వాహనంలో సిద్దిపేట జిల్లా ఆసుపత్రికి తరలించగా.. ముత్తయ్య చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముస్లిం మైనార్టీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కొండపాక



మండల పరిధిలోని దుద్దెడ ముస్లిం మైనార్టీ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా ఎండి అక్బర్ పాషా, ఉపాధ్యక్షునిగా అబ్దుల్ నబీ, ప్రధాన కార్యదర్శిగా నూరొద్దీన్, క్యాషియర్ గా నవీద్, సలహాదారులుగా సల్మాన్, గూడ్ సాబ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తామని, ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ ఫలాలను ప్రతీ ఒక్క పేద ముస్లిం కుటుంబానికీ అందేలా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు రఫీయొద్దిన్, మొహినొద్దిన్, జబ్బార్, షాదుల్ , అక్రమ్, సల్మాన్,అజ్గర్, అస్లాం సమీర్, సోహెల్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్



నవతెలంగాణ-గజ్వేల్

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ అన్నారు. శనివారం మహిళా శక్తి బహిరంగ సభకు గజ్వేల్ నుంచి బయలుదేరిన మహిళా సంఘాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళా సాధికత సాధిస్తున్నట్లు ఆయన చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని ప్రజలకు వివరించి సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ నరసింహారెడ్డి, యాదగిరి, నాయకులు నక్క రాములు గౌడ్, రమేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, సురేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూలే, అంబేడ్కర్ దారే మహిళలకు విముక్తి దారి

- డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ-గజ్వేల్

స్త్రీ జాతికి సాధికారత అందాలంటే ఆమేలో మానసిక విప్లవంతో పాటు పూలేబి అంబేడ్కర్ మార్గంలో ప్రయాణించటం ద్వారానే స్త్రీ జాతికి విముక్తి లభిస్తుందని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్ మండల పరిదిలో డిబిఎఫ్ అధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఎస్సీ,ఎస్టీ, ఓబిసి శ్రామీక మహిళలపై కుల వివక్షత,అణచివేత అత్యాచారాలు,శ్రమ దోపిడిలను ప్రతికటిద్దామనే సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం, లింగ సమానత్వం కోసం వాదిస్తూనే మహిళలు సాధించిన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మరియు రాజకీయ విజయాలను గుర్తించే ప్రపంచ దినోత్సవమన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, మహిళలు బాలవ్వ, లక్ష్మీ, సుజాత, దుర్గవ్వ, లచ్చవ్వ, భూమవ్వతో పాటు శ్రీకాంత్,చంద్రయ్య పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవం

- మహిళలకు ఓటు హక్కు 8 గంటల పని విధానం అమలు
- సీఐటీయూ జిల్లా కోశాధికారి జీ.భాస్కర్



నవతెలంగాణ-దుబ్బాక

20వ శతాబ్ద ప్రారంభంలో దోపిడి, అమానవీయ పని పరిస్థితులు, సామ్రాజ్యవాద యుద్ధాలకు వ్యతిరేకంగా.. తమకూ ఓటు హక్కు కావాలన్న డిమాండ్‌తో మహిళా కార్మికులు చేసిన పోరాటాల ఫలితమే "మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం" అని సీఐటీయూ సిద్ధిపేట జిల్లా కోశాధికారి జీ.భాస్కర్ తెలిపారు. శనివారం దుబ్బాక మున్సిపల్ కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జీ.భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎర్రజెండా పోరాటం (రష్యన్ విప్లవం) ద్వారా మహిళలకు మొదటిసారిగా ఓటు హక్కుతో పాటుగా 8 గంటల పని విధానం, ఇతర అనేక హక్కులు లభించినట్లు గుర్తు చేశారు. మహిళలకు సమానత్వం, న్యాయం,దోపిడీ,వివక్షహింస లేని జీవితమే లక్ష్యంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుగుతుందన్నారు. నేడు సోషలిస్ట్ వర్గ దృక్పథాన్ని మరుగునపరిచి.. వ్యాపార ధోరణి,సంస్కృతి పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ స్కీములైన అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, జాతీయ ఆరోగ్య మిషన్‌లలో పనిచేస్తున్న కార్మికుల్లో మహిళలే అత్యధికులని, వీరిని ప్రభుత్వం కార్మికులుగా గుర్తించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ 8 గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ 12 గంటల పని విధానాన్ని అమలు చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ స్ఫూర్తితో మహిళలు తమ హక్కుల కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ దుబ్బాక టౌన్ కన్వీనర్ కొంపల్లి భాస్కర్ నాయకులు సాదిక్, నాగరాణి, భాగ్యలక్ష్మి, శ్యామల, చంద్రకళ, శారద, భారతి, లత, శోభ పలువురు పాల్గొన్నారు.

గత సంవత్సరం మూల్యాంకనం పారితోషికం చెల్లించాలి

నవతెలంగాణ-కొండపాక



గత సంవత్సరం పదో తరగతి మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు పారితోషకం వెంటనే చెల్లించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు బాకి చంద్రభాను కోరారు. కొండపాక మండలం దుద్దెడలో ఆయ న మాట్లాడుతూ గత సంవత్సరంలో పదవ తరగతి మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు ఇంతవరకు పారి తోషకం చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ప్రతి సంవత్సరం మూల్యాంకనం జరిగిన వెంటనే ఉపాధ్యాయు లకు వారి పారితోషకాన్ని నగదు రూపంలో కానీ అకౌంట్లో జమ చేసేవారని ఇంత జాప్యం చేయడం సరైంది కాదన్నా రు. విద్యాశాఖ వెంటనే పారితోషకాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 2008వ సంవత్సరం ఉపాధ్యాయులుగా ఇటీవలే నియమించబడ్డ వారికి రెగ్యులర్ స్కేల్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ నుంచి రావాల్సిన పి ఆర్ సి ని నాలుగు డీఏలను వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరిష్కారం చేయ ని యెడల రాష్ట్ర వ్యాప్త ఉపాధ్యాయుల ఉద్యమాన్ని చేప డతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దేవర మల్లయ్య, ఆడిట్ కన్వీనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుల మధ్య నీటి వివాదం

- ఇరిగేషన్ అధికారుల హామీతో సద్దుమణిగిన వివాదం



నవతెలంగాణ-నంగునూరు

సిద్ధిపేట జిల్లా నంగునూరు, మద్దూరు మండల రైతుల మధ్య సాగు నీటి వివాదంతో ఇరు మండలాల రైతులకు వాగ్వాదం చోటుచేసుకుంది. నంగునూరు మండల శివారులోని కమలాయపల్లి ఫీడర్ ఛానల్ వద్ద ఇరిగేషన్ అధికారులు తాత్కాలిక జీవోతో రంగనాయక సాగర్ కుడి కాలువ ఎల్ డి-10కు గండీ కొడుతున్నారనే సమాచారంతో నంగునూరు మండల రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఇరు మండలాల రైతులకు సాగునీరు కోసం గొడవ తీవ్రం కావడంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. అదే సమయంలో ఇరిగేషన్ ఏఈ రాజు, చేర్యాల పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని ఇరు మండలాల రైతులకు నచ్చేజెప్పే ప్రయత్నం చేశారు. కాగా కేవలం కమలాయపల్లి గ్రామానికి మాత్రమే సాగు నీరు మళ్ళించాలని మిగితా నాలుగు గ్రామాలకు సాగునీటిని మళ్ళించేది లేదని అధికారులతో నంగునూరు రైతులు తేల్చి చెప్పగా ఇరిగేషన్ ఏఈ రాజు వారికి హామీ ఇచ్చారు. దీంతో గొడవ సద్దుమణిగింది. ఈ సందర్భంగా నంగునూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ కోల రమేశ్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్‌లు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నేతృత్వంలో ఏర్పడినటువంటి కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగం అయిన రంగనాయక సాగర్ కాల్వ ద్వారా నంగునూరు మండలం లోని 11 గ్రామాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ఎల్ డి-10 కాలువను నిర్మించడం జరిగిందని తెలిపారు. భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి ఇటీవల సందర్శించి ఎల్ డి-10 కాలువను కమలాయపల్లి గ్రామం నుంచి పోతుందని అక్రమంగా గండీ కొట్టే ప్రయత్నంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం తాత్కాలిక జీవోను జారీ చేసి నంగునూరు ప్రాంత రైతుల నోట్లో మట్టి కొట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు మధ్య వైషమ్యాలు పెంచి యుద్ధ వాతావరణం నెలకొల్పే ప్రయత్నాలు చేయడం సిగ్గు చేటుగా ఉందన్నారు. కమలాయపల్లి ఒక గ్రామానికి మాత్రమే సాగు నీరు ఇవ్వాలని, మిగితా గ్రామాలకు నీటిని మళ్ళీస్తే ఊరుకోబోమని తేల్చిచెప్పారు. అధికారం చేతులో ఉందని తాత్కాలిక జీవో ను శాశ్వత జీవో గా మార్చినట్లయితే మండల రైతులతో కలిసి ధర్నాలు, నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య, బద్దిపడగ కిష్టారెడ్డి, వేణు చక్రవర్తి, రాంరెడ్డి, రచ్చ సిద్ధు, వెంకట్ రెడ్డి, ఆకుబత్తిని రాము, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-చేర్యాల



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనం రమేష్, ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల రంజిత్ రెడ్డి మాట్లాడుతూ 1910లో పని ఒత్తిడి తగ్గించాలని శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని, మహిళలను కూడా మనుషులుగా గుర్తించాలని వీరనారి లారా జెట్కిన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా కన్వెన్షన్‌నే నేడు అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. మొట్ట మొదటిసారిగా రష్యాలో సోష లిస్టు విప్లవం విజయవంతమైన తర్వాత 18 గంటల నుంచి 8 గంటలకు పని గంటలను తగ్గించి స్త్రీలకు మొదటి ఓటు హక్కును కల్పించింది కమ్యూనిస్టు పాలిత దేశాలేనని గుర్తు చేశారు. 1949లో చైనా కూడా ఇవే విధానాలు అమలు చేసిందని గుర్తు చేశారు. 1975లో ఐక్యరాజ్యసమితి వివిధ దేశాలను ఐక్యపరచి కమ్యూనిస్టు పాలిత దేశాలు స్త్రీల అభ్యున్నతి కొరకు తీసుకున్న సంస్కరణలను చూసి శ్రామిక మహిళల పోరాటాలను గుర్తించి మార్చి 8నే అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. సావిత్రిబాయి పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వంటి మహనీయులు స్త్రీల సాధికారత, అభ్యున్నతి కోసం చేసిన కృషిని స్ఫూర్తిగా తమ హక్కుల కొరకు మహిళలు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాడూరు భరత్ కుమార్, లెనిన్ రాజ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం





నవతెలంగాణ-మర్కుక్

సృష్టికి మూలం మహిళలేనని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అంగడికిష్టాపూర్ మాజీ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీ రాములు గౌడ్ కోరారు. శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగడికిష్టాపూర్, చేబర్తి గ్రామాలలో అంగన్‌వాడీ టిచర్లను ఆశావర్కర్లకు,గ్రామ పంచాయతి పారిశుధ్య కార్మికులకు, ఐకెపి సిఏలు, మహిళలకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఆకాశమే హద్దుగా పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీ పడి, ఆర్థికంగా ఎదగాలన్నారు. సమాజంలో మార్పు మహిళలతోనే సాధ్యమని చెప్పారు. మహిళలు సాధికారత సాధించాలని కోరారు. మహిళలందరికి అంతర్జాతీయ మహిళదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చేబర్తి మాజీ సర్పంచ్ ఎర్రబాగు ఆశోక్,మాజీ ఉపసర్పంచ్ గుర్రాల స్వామి, గ్రామ పంచాయతి కార్యదర్శి సిద్దేశ్వర్, కాంగ్రెస్ మర్కుక్ ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి, నాయకులు మహిపాల్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, రాముగౌడ్, కుమ్మరి కనకయ్య, జయరాం, గంధమల్ల చంద్రం,టప్ప రాజు, రాంబాబు, బాలకృష్ణ, అనిల్, మహిళ సంఘాల సభ్యులు తదితరులున్నారు.

పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి

- ఎస్టీయు జిల్లా అధ్యక్షులు పట్నం భూపాల్



నవతెలంగాణ-సిద్ధిపేట

పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్టీయు జిల్లా అధ్యక్షులు పట్నం భూపాల్ కోరారు. స్టేట్ టీచర్స్ యూనియన్ ప్రథమ కార్యవర్గ సమావేశం స్థానిక పి. ఎస్ డబ్ల్యూ. ఏ భవన్ లో జిల్లా శాఖ అధ్యక్షులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ ఇంకా కొన్ని పెండింగ్ బిల్లులు ఆలస్యం అవుతుండడం ఉపాధ్యాయులకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తూ, పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని కోరారు. సిపిఎస్ తొలగిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినందున సిపిఎస్ తొలగించేందుకు చర్యలు తీసుకొని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మట్టపల్లి రంగారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దుల రవీందర్ రెడ్డి, ఖాతా యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి రేకులపల్లి లింగారెడ్డి, విద్యా పరిరక్షణ సిఫారసుల కమిటీ కన్వీనర్ లింగ శ్రీనివాస్, రాష్ట్ర ప్రచురణాల కమిటీ కో- కన్వీనర్ ఆర్ భూపాల్, రాష్ట్ర క్రీడల కమిటీ కోకన్వీనర్ కలకుంట రాములు, పిఆర్సి కమిటీ కో- కన్వీనర్, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వాహనాదారులు జాగ్రత్త.... అది మరిస్తే అంతే

- ఘనాపూర్ బుస్సాపూర్ రింగ్ రోడ్డుపై గుంత
- అదుపుతప్పి నిత్యం ప్రమాదాలు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు
- మరమ్మతులు చేపట్టి ప్రాణాలు కాపాడండి



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

వాహనాదారులు ట్రాఫిక్ సమస్య లేకుండా దూర ప్రాంతాలకు సులువుగా చేరుకునే విధంగా సిద్ధిపేట చుట్టూ రెండు వరుసల రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా దుద్దెల నుంచి ఘనపూర్ బుస్సాపూర్ పుల్లూరు గంగాపూర్ వివిధ గ్రామాలను కలుపుతూ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. నిత్యం ప్రజలు హైదరాబాద్ నుంచి మెదక్ వెళ్లే ప్రజలు రింగ్ రోడ్డు పై నుంచే రవాణా చేస్తున్నారు. అంతేకకుండా చుట్టుపక్కల గ్రామాలు సిద్ధిపేట కు వెళ్లడానికి ప్రజలు రైతులు సులువుగా ఉంటుందని తొందరగా చేరుకోవచ్చని ప్రయాణం చేస్తారు. అయితే మల్లన్న సాగర్ నుంచి నీటిని దుబ్బాకకు పైప్ లైన్ ద్వారా వివిధ గ్రామాలకు చెరువులు నింపాలని ఉద్దేశంతో అండర్ పైప్ లైన్ వేశారు. ఘనాపూర్ నుంచి బుస్సాపూర్ వెళ్లే దారిలో రోడ్ కింద నుంచి మల్లన్న సాగర్ వాటర్ పైపులైన్ తీసుకెళ్లారు. దాని పైన నుంచి మట్టి పోసి తారు రోడ్డు వేశారు. అది రోజు రోజుకు కిందికి కృంగిపోయి గుంత పడింది. రోడ్డు మంచిగా ఉందని వాహనదారులు వేగంగా నడపడంతో కృంగిపోయిన గుంత ఏర్పడక బైకు అదుపు తప్పి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే అధికారులు మరమ్మతులు చేపట్టి వాహనాదారులకు ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.

వరల్డ్ రికార్డు సృష్టించిన బేగంపేట విద్యార్థి పంజాల కార్తిక

- కలామ్స్ వరల్డ్ రికార్డ్స్ వారి గుర్తింపు



నవతెలంగాణ-రాయపోల్

ఆవర్తన పట్టిక లోని మూలకాల పేర్లను అతి తక్కువ సమయంలో చెబుతూ వరల్డ్ రికార్డు సృష్టించిన బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పంజాల కార్తికను ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి అభినందించారు. శనివా రం తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నై నగరంలో జరిగిన పోటీలలో కార్తీకకు వరల్డ్ రికార్డ్ గుర్తింపు పత్రం, అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం బేగంపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న పంజాల కార్తిక అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8 చెన్నై , తమి ళనాడు రాష్ట్రంలో నిర్వహించిన పోటీలలో ఆవర్తన పట్టి కలలోని 118 మూలకాలను 8 సెకండ్ల 85 మిల్లీ సెకం డ్సలలో కంఠస్థం చేయడంతో ప్రపంచ రికా ర్డును సృష్టిం చిందన్నారు. ఈ విషయాన్ని కలామ్స్ వరల్డ్ రికార్డ్స్ వారు గుర్తించి విద్యార్థి కార్తీకకు గుర్తింపు ప్రశంసా పత్రం తో పాటు అవార్డు అందజేశారని తెలియజేశారు. విద్యార్థి కార్తీకను ప్రోత్సహించిన ఉపాధ్యాయులు కొల్యూరు భాస్కర్ రెడ్డిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ సరైన వేదిక

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి
- మహిళలు అన్ని రంగాల్లో పనిచేస్తున్నారు



నవతెలంగాణ-సిద్దిపేట

క్షణికావేశంలో చేసిన తప్పులను, పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి ఈ లోక్ అదాలత్ సరైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు. శనివారం కోర్టు కాంప్లెక్స్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకసారి లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే మళ్లీ అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని చెప్పారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే బదులు ఒకేసారి లోక్ అదాలత్‌లో కేసును రాజీ చేసుకుంటే సమయం వృథా అవ్వకుండా ఉంటుందన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో 3557 క్రిమినల్ కేసులు, 50 సివిల్ కేసులు, 15 మోటారు ప్రమాద కేసులను పరిష్కరించడం జరిగిందని తెలిపారు.

మహిళలు అన్ని రంగాలలో పని చేస్తున్నారు

మహిళలు అన్ని రంగాలలో పని చేస్తున్నారని, గత 50 సం... క్రితము మహిళలు వంట ఇంటికే పరిమితముగా ఉండేవారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మగపిల్లలతో పాటు అడ పిల్లలను కూడా సమానంగా చదివించాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యములో నిర్వహించిన ఎస్సే రైటింగ్ కాంపిటీషన్, కుకింగ్ కాంపిటీషన్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు స్వాతి రెడ్డి, మిలింద కాంబ్లే, శ్రావని యాదవ్, తరణి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, సెక్రటరీ సత్యనా రాయణ, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు

సుదర్శన చక్రానికి పూజలు

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని పాముల పార్తి గ్రామంలోని సీతా రామాంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవంలో భాగంగా ఆలయ గోపురంపై సుదర్శన చక్రం ప్రతిష్టిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఆలయ కమిటీ , మండల బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ చంద్రకళ దంపతులు సుదర్శన చక్రానికి ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్థులు, తదితరులున్నారు.

పాత వెంకటేశ్వర దేవాలయ 55వ వార్షిక బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-సిద్ధిపేట



పట్టణంలోని పాత వెంకటేశ్వర దేవాలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా సమితి వారి ఆధ్వర్యములో ఆలయ 55వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం సాయం త్రం అంకురార్పణ పూజలు నిర్వహించి ప్రారంభిం చారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి స్వా మి వారి కి 108 కళశాలలో అభిషేకం, తదుపరి మూల మంత్ర హవనం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సా యంత్రం 6 గంటలకు నిత్య హోమము, శ్రీ భూ నీళా సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వార్ల ఎదురుకోల్లు, సోమ వారం ఉదయం 8 గంటల కు లక్ష్మీ హవనం, మధ్యాహ్నం శ్రీ భూ నీళా సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవము తదుపరి అన్నప్రసాద వితరణ, సాయం త్రం 6 గంటలకు నిత్య హవనం లక్ష్మీ పూజ (కుంకుమ పూజ) నిర్వహించనున్నట్లు నిర్వాహకు లు తెలిపారు. మంగళవారము ఉద యం 8 గంటలకు లక్ష్మీ నారసింహ హవనం, మహా పూర్ణాహుతి, కలశ ప్రోక్షణ తదుపరి అన్న ప్రసాద వితరణ, సాయం త్రం 5 గంటల నుండి సిద్దిపేట పట్టణ ప్రధాన దారుల గుండా శ్రీ భూ నీళా సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వార్ల రథోత్సవం జరుగు తుందన్నారు. బుధవారము ఐదవ రోజు చివరి రోజు రాత్రి 7 గంటలకు స్వామి వారికి ఏకాంత సేవలు నిర్వహించి బ్రహ్మోత్సవాములు ముగించబడు తాయని నిర్వాహకులు తెలిపారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డ్

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలంలో 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏలు పోస్ట్ కార్డు ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డు పంపారు. శనివారం వీఆర్ఏ, వీఆర్ఏ వారసులు ఎమ్మార్వో ఆఫీస్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు గుడుమల్ల రాజలింగం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 61 సంవత్సరాల పైబడిన వీఆర్ఏ, వీఆర్ఏ వారసులు గౌరవేని అబ్బయ్య, పిల్లి శ్రీనివాస్, మోటం చక్రపాణి, గజ్వేలి సురేశ్ , మాల మంగలి విజయ, గూళ్ల రాములు తదితరులు పాల్గొన్నారు

మహిళా పోలీసులను సన్మానించిన సీఐ

నవతెలంగాణ-చేర్యాల



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చేర్యాల పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ప్రొబెషనర్ ఎస్ఐ సమత, కానిస్టేబుల్ మంజుల, కవితను శనివారం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ ఎల్.శ్రీను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి చిరు కానుకలు అందజేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నరేందర్ పాల్గొన్నారు.

మహిళా పారిశుధ్య కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-బెజ్జంకి



జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి ప్రసీత్ రెడ్డి మహిళ పారిశుధ్య కార్మికులను శనివారం శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపాధి పనుల వద్ద మహిళ కూలీలను శాలువ కప్పి సన్మానించారు. కారోబార్ బోనగిరి లక్ష్మన్, పంచాయతీ సిబ్బంది సంపత్, శివ, వినోద్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం





















నవతెలంగాణ-గజ్వేల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంజీర కాన్సెప్ట్ స్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అంబాదాస్, డైరెక్టర్ రజిత, ఉపాధ్యాయినులను ఇతర మహిళా సిబ్బందిని సన్మానించారు. అలాగే ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ రేడియాలజిస్ట్ డా.బి సుజాత మహిళలకు వచ్చే ఆరోగ్య సమస్యలపైన, ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధి పైన అవగాహన కల్పించారు. భారతీయ కుటుంబ వ్యవస్థలో మహిళ ప్రాముఖ్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మట్టయ్య చౌదరి, మంజీర కాన్సెప్ట్ స్కూల్ ఇంచార్జి అఫ్జలుద్దీన్ పటేల్, ప్రగతి సెంట్రల్ స్కూల్ ఇంచార్జి రహమత్, ప్రగతి విద్యా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ కార్యాలయంలో ..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గజ్వేల్ టీపీటీఎఫ్ కార్యాలయంలో శనివారం వివిధ రంగాలలో గుర్తింపు పొందిన ఆరుగురు మహిళామణులకు పురస్కారాలు అందించారు. చాడ పద్మ, కొరిడె హరిణా పవన్, అష్టకాల శారద, ఉప్పల మాధవి, బ్రహ్మాండం గాయత్రీ రమణమూర్తి, డాక్టర్ జంపన శ్రీసంధ్యా దేవి. సంధాన కర్తగా రాయారావు యువ గాయకురాలు శివాని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, స్వావలంబనతో సమాజంలోని అన్ని పరిస్థితులను ధీటుగా ఎదుర్కొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఎన్ సీ రాజమౌళి మాట్లాడుతూ మగువ సృష్టికి మూలం, మహిళలను గౌరవించడం మన విధి అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు రాయారావు విశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ అమ్మ, నాన్నలకు ఉన్న గొప్ప లక్షణాలను దృష్టిలో పెట్టుకొని ఆరుగురు మహిళలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బండారు రామ్మోహనరావు, రాజేశ్వర్ రావు, ఉప్పల మెట్టయ్య, స్వర్గం చంద్రయ్య, అరుణ, వసంత లక్ష్మి, మంజుల, వంటేరు ఉమ, లయన్స్ క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

మొదటగా పూజించేది మహిళలే అని ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు మహిళలను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి వెలుగునిచ్చిన మహిళను మన అందరం గౌరవించాలని ఆయన కోరారు. మహిళా సంక్షేమానికి గత ప్రభుత్వంలో పెద్దపీట వేసినట్లు ఆయన గుర్తు చేశారు. కేసీఆర్ మహిళా సంక్షేమానికి ఎంతో ప్రాధాన్య తెచ్చినట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు అన్నపూర్ణ శ్రీనివాస్, మహిళా మాజీ కౌన్సిల్ సభ్యులు భాగ్యలక్ష్మి, రజిత, అరుణ, విద్యా రాణి, శ్యామల, బాలమని, అర్చన, వరలక్ష్మి, ఫర్జానా, రజియా, నాయకులు ఉమాదేవి, మంజుల రెడ్డి, సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో

మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చని సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. శనివారం గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించి. మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో శాంతి సేన అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మిస్ హైదరాబాద్‌గా ఎన్నికైన జ్ఞానేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, మిస్ హైదరాబాద్ జ్ఞానేశ్వరి మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని, భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో మహిళలు ముందు సాగాలన్నారు. పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వెళ్తున్నారని, భవిష్యత్తులో మహిళలు తల్లిదండ్రులకు కొడుకులు లేని లోటు తీర్చే విధంగా తయారు కావాలని తెలిపారు. సృష్టికి మూలం ఒక మహిళ అని ఈ ప్రపంచంలో వెలుగునిచ్చేది స్త్రీ, స్త్రీ లేనిదే మానవతా మనవడా లేదన్నారు. మహిళలకి ముఖ్యంగా విద్యార్థులకు తల్లిదండ్రులు, సమాజం నుండి సహకారం పూర్తిగా లభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జయశ్రీ, డాక్టర్ మంజుల, డాక్టర్ త్రివేణి, డాక్టర్ సమీక్ష, నర్సింగ్ ఆఫీసర్స్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగా-సిద్ధిపేట

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా సిద్దిపేట, దుబ్బాక డిపోల మహిళా ఉద్యోగుస్తులతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం డిపో మేనేజర్ వై.సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్, కవిత్రి సువర్ణ దేవి మాట్లాడుతూ మహిళా శక్తి గొప్పతనం, మహిళల విజయంలో పురుషుని పాత్ర, మహిళల ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్త పట్ల వివరించారు. అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన సిద్దిపేట, దుబ్బాక మహిళా కార్మికులకు, ఈ సంవత్సరం రిటైర్డ్ కాబోతున్న ఒక మహిళ కార్మికురాలికి, ఆర్టీసీ బసులోనే ప్రయాణం చేస్తూ ఆర్టీసీని ఆదరిస్తున్న ఇద్దరు మహిళా ప్రయాణికులకు ఏ.స్రవంతి, వి.చంద్రకళ, ఉత్తమ ప్రతిభ కనబరిచిన టీమ్ డ్రైవర్ల బాలకిషన్, వెంకటయ్య సతీమణులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరి, అసిస్టెంట్ ఇంజనీరు రంజిత్ కుమార్, దుబ్బాక ఇంచార్జ్ కనక లక్ష్మీ, సూపర్వైజర్లు, మహిళ కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపాల్ కార్యాలయంలో..

సృష్టికి మూలం, ఆధారం మహిళలేనని, సమాజంలో మహిళలు లేని పాత్ర ఊహించలేనిదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ అన్నారు. మహిళల దినోత్సవం సందర్భంగా మున్సిపాల్ కార్యాలయంలో శనివారం పారిశుద్ధ్య కార్మికులను చీరలను అందజేసి, మహిళ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పాలన ఇందిరమ్మ రాజ్యం ఏర్పడడం కోసమేనన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు అనేక రకాల కొత్త స్కీములను తీసుకువచ్చి, లక్షాధికారులను చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యదారి మధు, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గయాజుద్దీన్, కూడా స్టేట్ మైనార్టీ జనరల్ సెక్రెటరీ హర్షద్, నాయకులు విజయ్, డేనియల్, ఎన్ ఎస్ యు నాయకులు అనిల్, అమాన్, తదితరులు పాల్గొన్నారు.

బీసీసెల్ ఆధ్వర్యంలో..

మహిళ దినోత్సవ సందర్భంగా జిల్లా బీసీసెల్ ఆధ్వర్యంలో న్యూ హైస్కూల్లో మహిళా ఉపాధ్యాయురాలికి సన్మానం చేసినట్లు బీసీ సెల్ జిల్లా ప్రతినిధి సీతా బాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తుల మల్లేశం, రాజాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట అర్బన్ మండలం పున్నాగ సమీపంలో గల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సిఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బంది స్రవంతి, రాణి, లక్ష్మీ, కవిత, పూజ, రోహిణీలను సన్మానించి చిరు కానుకలు అందజేసి కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మహిళలను గౌరవించుకోవడం మన సాంప్రదాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు మల్లేశం, చంద్రయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం దుద్దెడ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వసతి గృహంలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలోని మహిళా టీచర్లకు, తల్లులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు చిట్యాల నరసింహులు మాట్లాడుతు మహిళలు లేని సమాజాన్ని ఊహించలేమనిఅన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. మన జీవితంలో జగతిలో ప్రగతిలో సగంగా కలిసి పోయి కష్ట సుఖాలలో తోడునీడగా ఉంటున్న స్త్రీ జాతికి మనం యెంతో రుణ పడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ ,జూనియర్ వైస్ ప్రిన్సిపల్ స్వప్న, జ్యోతి అలాగే తల్లిదండ్రుల కమిటీ సభ్యులు జాలిగామ నరసింహరావు, మునిగడప రమేష్, కొడిమల్ల శ్రీనివాస్. సిరసగండ్ల నర్సింలు, కొలిపాక భవాని తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుబ్బాక

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం దుబ్బాకలోని లైబ్రరీలో మహిళా పాఠకులను గౌరవిస్తూ.. వారికి ఉచిత సభ్యత్వాలు ఇవ్వడం జరిగిందని లైబ్రేరియన్ దాసరి రాజు తెలిపారు. అనంతరం వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి స్ఫూర్తి నింపారు. ఈ కార్యక్రమంలో శ్రావణి, సారిక, అఖిల, శ్రీ కన్య, కీసరి దివ్య, మరాటి స్వామి, దోసల రాజేష్, కీసరి స్వామి పలువురున్నారు.

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు గ్రామ పంచాయతీలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మాజీ సర్పంచ్ చౌడుచెర్ల మమత జైపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్రకళలు మాట్లాడారు. ఏఎస్ఎమ్ సామ్రాజ్యం, రజిత అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్ ,ఎంపీ డబ్ల్యూ వర్కర్స్‌కి గ్రామ స్థాయి మహిళ ఉద్యోగులందరికీ సన్మానం చేశారు.

అంగన్వాడీ కేంద్రంలో..

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పట్టణంలోని 7వ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ ఇందిర ఆధ్వర్యంలో శనివారం ఉదయం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ ఇందిర మాట్లాడుతూ మహిళా దినోత్సవ విశిష్టత గురించి వివరించారు. బాలిక చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం బాగు పడుతుందని, బాలికల చదువు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్నారి విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



టోల్ ప్లాజా వద్ద స్థానిక వాహనాలకు మినహాయించాలి

పట్టణ అధ్యక్షులు జానకిరామ్ గౌడ్

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని అల్లాపూర్ టోల్ ప్లాజా వద్ద స్థానిక వాహనాలకు మినహాయింపు ఇవ్వాలని టోల్ ప్లాజా మేనేజర్‌కు బీజేపీ పట్టణ అధ్యక్షులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోల్ ఫీజులు విధించడం వల్ల స్థానిక వాహన యాజమానులపై అనవసరమైన ఆర్థిక భారం పడుతుందన్నారు. టోల్ ప్లాజా అధికారుల నుండి సానుకూలమైన ప్రతిస్పందన లభిస్తుందని ఆశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ అసెంబ్లీ కన్వీనర్ రామ్మోహన్ గౌడ్, జిల్లా నాయకులు తాటి విఠల్, మాజీ మండల అధ్యక్షుడు రామునిగారి మహేష్ గౌడ్, కార్తీక్ గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల జోలికొస్తే మాత్రం ఊరుకోబోము

బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్

నవతెలంగాణ-శివ్వంపేట



గ్రామాలలో ఎవరైనా సరే బీజేపీ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే మాత్రం ఎట్టి పరిస్థితులలో ఊరుకోబోమని బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ హెచ్చరించారు. భూముల గొడవల కారణంగా మండలంలోని ఉసిరికపల్లి తాండ బూత్ అధ్యక్షులు రాజు నివాస ఇంటిని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్ మండల పార్టీ అధ్యక్షులు పెద్దపులి రవితో కలిసి శనివారం పరామర్శించి, ఓదార్చారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని తనవంతు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనాగాని ఏదైనా గాని సమస్యలుంటే పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలే తప్ప, ఆస్తులను, ఇండ్లను ధ్వంసం చేయడం మంచి సంప్రదాయం కాదని ఆయన హితవు పలికారు. జిల్లాలో బీజేపీ ఎదుగుదలను చూసి కొందరు జీర్ణించుకోలేక పోతున్నారని, నష్టపోయిన బీజేపీ బూత్ అధ్యక్షులు రవి కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందన్నారు. బాధ్యులైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కారకులపై చర్యలు తీసుకోకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకలి బిక్షపతి, దుబ్బ శేఖర్, బజరంగి అంజి, బీజేవైఎం మండల అధ్యక్షులు బల్కంపేట భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్మదిపూర్‌లో ఘనంగా గోటి తలంబ్రాల దీక్ష.

నవతెలంగాణ-గజ్వేల్



భద్రాచల సీతారాముల కల్యానానికి 250కిలోల గోటి తలంబ్రాలు అందించాలనే సంకల్పానికి గ్రామ, గ్రామాన శ్రీకారం చుట్టింది. గజ్వేల్‌లోని సమాజం సంస్థ. అందులో భాగంగా శనివారం గజ్వేల్ మండలంఆహ్మదిపూర్ గ్రామంలో భక్తులు పెద్ద ఎత్తున రామాలయంకు చేరుకొని గోటితో వడ్లను ఓలిచారు. సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు 2గంటల పాటు రామనామ స్మరణ చేయించి రామనామం గురించి, భద్రాచల గోటి తలంబ్రాల పవిత్రత గురించి అందరికీ తెలియజేశారు. భక్తులందరు వడ్లను ఓలిచి అక్కడే రామకోటి రామరాజుకు అందజేశారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ మెదటి సారిగా తమ గ్రామానికి గోటి తలంబ్రాలు రావడం తమకు చాలా ఆనందంగా ఉందన్నారు. మేము భద్రాచలం వెళ్లలేక పోయిన కూడా తాము చేతులతో ఓలిచిన ఈ గోటి తలంబ్రాలు వెళ్లడం ఆనందంగా ఉందని భక్తులు సంతోషాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గీతా మందిరంలో 17వ వార్షికోత్సవం

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ పట్టణంలోని గీతా మందిరంలో ఈ నెల 9వ తేదిన 17వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు గీతామందిర్ నిర్వాహకులు తెలిపారు. 9వ తేదీ ఉదయం 7:25 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గణపతి పూజ, స్వస్తి వాచనం, రక్షా బంధనం, పంచగవ్యప్రాశన, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, మాతృక, యోగిని వాస్తు, క్షేత్ర పాలక, నవగ్రహ, సర్వతో భద్ర, మంటపాల దేవతా స్థాపన, ప్రధాన కలశ స్థాపన, శ్రీ గోపాల కృష్ణ స్వామి వారికి అష్టోత్తర శత కళాశార్చన, మహాభిషేకం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా గణపతి పంచ సూక్త హవనములు, రుద్ర హెూమము, స్థాపిత దేవతా మూల మంత్ర హవనం, హెూమబలి ప్రధానం, పూర్ణాహుతి, శ్రీ రుక్మిణీ కృష్ణ కళ్యాణం, తీర్థ ప్రసాదాలు వితరణ, ఋత్విక్ సన్మానం, మహదాశీర్వాదం, అనంతరం పరివ్రాజకా చార్య గురు మధనానంద పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద స్వామి వారి అనుగ్రహ భాషణం ఉంటుందని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

సీఎం సభకు తరలివెళ్లిన మహిళలు



నవతెలంగాణ-తూప్రాన్

హైదరాబాద్‌లో పరేడ్ గ్రౌండ్‌లో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించే మహిళా శక్తి ప్రారంభోత్సవ కార్యక్రమానికి తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహించే మహిళా ఆర్పీలు ఆర్టీసీ బస్సులలో బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల కష్టానికి తగిన ఫలితం దక్కినప్పుడే నిజమైన మహిళా దినోత్సవమన్నారు. మహిళలు ఎంత ఎత్తుకు ఎదిగిన వివక్షత కొనసాగుతూనే ఉందన్నారు. లింగ సమానత్వాన్ని సాధించడంలో మహిళా సంఘాల పాత్ర గణనీయంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మి,మహిళా రిసోర్స్ పర్సన్లు విజయలక్ష్మి శిరీష, ధనలక్ష్మి, మమత తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-మిరుదొడ్డి : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో సికింద్రాబాద్ పేరెంట్స్ గ్రౌండ్‌లో నిర్వహించే ముఖ్యమంత్రి సభకు మిరుదొడ్డి , అక్బర్ పేట భూంపల్లి మండలం లోని మహిళా సంఘాల సభ్యులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఏపీఎం దాకయ్య మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పథకాలను ప్రారంభం చేయడం జరుగుతుందని తెలిపారు ఈ అవకాశాన్ని మహిళలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు మండలంలోని అన్ని గ్రామాల మహిళలు తరలి వెళ్లామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఐకెపి సీసీలు బాలరాజు వైకుంఠం దేవదాసు సిద్ధ రాములు శ్రీనివాస్ మహేష్ నసీరుద్దీన్ స్వప్న మంగమ్మ , లక్ష్మిసుమలతతో పాటు వివో లీడర్ మహిళా సంఘాల సభ్యులు భారీగా పాల్గొన్నారు.

తలాపునా జలాశయాలున్నా..పంటలెండుతున్నాయి

బీజేపీ మండల నాయకుడు సాన వేణు అవేదన

మాజీ మంత్రి హరీశ్ రావుకున్న శ్రద్ధ ఎమ్మెల్యే కవ్వంపల్లికి లేదంటూ విమర్శలు

తక్షణమే ఎమ్మెల్యే శ్రద్ధ చూపి సాగు నీరందించాలని డిమాండ్

నవతెలంగాణ-బెజ్జంకి



తెలంగాణ రాష్ట్ర సిద్ధించకముందు ఎదుర్కొన్న సాగు నీరు ఇబ్బందులు..మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎదురవుతున్నాయని.. తలాపునా అన్నపూర్ణ, రంగనాయక జలాశయాలున్నా భూగర్భ జలాలు వృద్ధి చెందక సాగు నీరందక తమ పంటలెండుతున్నాయని బీజేపీ మండల నాయకుడు సాన వేణు శనివారం అవేదన వ్యక్తం చేశారు. అన్నపూర్ణ జలాశయం నుంచి నీటిని తరలించుకుని తన నియోజకవర్గంలోని రైతుల పంటలకు సాగు నీరందించిన సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీర్ హరీశ్ రావుకున్న శ్రద్ధ.. తన నియోజకవర్గంలోని రైతుల పంటలకు సాగు నీరందించాలనే మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక శ్రద్ధ చూపి తక్షణమే అన్నపూర్ణ జలాశయం నీటితో మండలంలోని అయా గ్రామాల చెరువులు, చెక్ డ్యాములను నింపి భూగర్భ జలాలు వృద్ధి చెందేలా కృషి చేయాలని తద్వారా ఎండుతున్న పంటలకు జీవం పోసిన వారవుతారన్నారు.



మహిళా పోలీసులకు సన్మానం

నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిద్ధిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై అపూర్వ రెడ్డి, ఏఎస్ఐ పరమేశ్వరి, జ్యోతి, మమతలను శాలువాతో ఘనంగా సీఐ శ్రీను శాలువతో సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నకోడూర్ ఎస్ఐ బాలకృష్ణ, రాజగోపాలపేట ఎస్ఐ ఆసిఫ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

